ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 13.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 324 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



నమీబియాపై భారత్ ఘన విజయం 10

త్వరలోనే రాజకీయ పార్టీ ప్రకటిస్తా

తెలంగాణ అస్తిత్వం కోసం కొత్త వేదిక.. ఉద్యమకారుల కోసం మరో ఉద్యమం

- ఉద్యమకారుల ఆత్మగౌరవ దినంగా ఫిబ్రవరి 12
- పదేళ్లు అవకాశం ఇచ్చాం.. ఏమి చేశారు?
- బీఆర్ఎస్‌పై అసంతృప్తి, కాంగ్రెస్‌కు హెచ్చరిక
- ఉద్యమ సోయి లేని సీఎం మన దౌర్భాగ్యం
- కేసీఆర్‌ను వ్యక్తిగతంగా విమర్శించే ఉద్దేశం లేదు
- పదేళ్లలో ఉద్యమకారులకు ఎందుకు న్యాయం జరగలేదు
- అహంకారమే బీఆర్ఎస్ ఓటమికి కారణం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

చిటుకుల మైసారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 12: ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరగలేదని, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే కొత్త రాజకీయ పార్టీని త్వరలో ప్రకటిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో తాము బాధపడ్డామని, కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చకపోతే తీవ్ర పోరాటం తప్పదని హెచ్చరించారు. ఉద్యమకారుల గుర్తింపుకు యాప్, ప్రైవేట్ రంగంలో 20 శాతం రిజర్వేషన్లు, సంక్షేమ బోర్డు ఏర్పాటు వంటి డిమాండ్లతో కవిత చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ రాజకీయ వేడిని రాజేసింది. పదికి పైగా ఉద్యమ సంఘాలు, పెద్ద సంఖ్యలో ఉద్యమ నాయకులు, మహిళా

...:: మిగతా 5లో

"మీరు బయట ఉండి బాధపడితే నేను బీఆర్ఎస్‌లో ఉండి బాధపడ్డాను. జీ హుజూర్ అంటే అక్కడే ఉండేదాన్ని. క్యా హుజూర్ అన్నందుకు ఇక్కడ ఉన్నా. కేసీఆర్‌ను వ్యక్తిగతంగా విమర్శించే ఉద్దేశం లేదు. పదేళ్లు అవకాశం దక్కినా ఉద్యమకారులకు ఎందుకు న్యాయం జరగలేదు. అహంకారం, సహనశీలత లేకపోవడమే బీఆర్ఎస్ అధికారం కోల్పోవడానికి కారణం. ఉద్యమ సోయి లేని వ్యక్తి సీఎం కావడం మన దౌర్భాగ్యం. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కోదండరాం, ఆకునూరి మురళి వంటి నేతలు మద్దతు ఇవ్వడమే కారణం."

- కల్వకుంట్ల కవిత



నేనే రాజు, నేనే మంత్రిని!

నేను ఎవరితోనూ పోల్చుకోను

పదిన్నరేళ్లపాటు నేనే ముఖ్యమంత్రిగా ఉంటా



- ఎన్టీఆర్‌కు భారత రత్న ఇచ్చేందుకు తన మద్దతు
- త్వరలోనే హైదరాబాద్లో ఎన్టీఆర్ విగ్రహం
- 'కాళేశ్వరం'పై విచారణ ఏమైందో కిషన్‌రెడ్డి చెప్పాలి
- ప్రభాకర్‌రావు విచారణ తర్వాతే.. వారికి నోటీసులు
- మీడియా ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: తెలంగాణలో నేనే రాజు.. నేనే మంత్రినని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తాను ఎవరితోనూ పోల్చుకోనని.. తనకు ఎవరూ పోటీ కారన్నారు. న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం సీఎం రేవంత్ రెడ్డి మీడియాలో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 2029లో జమిలి ఎన్నికలు రానున్నాయని ఆయన జోస్యం చెప్పారు. పదిన్నరేళ్లపాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని పునరుద్ఘాటించారు. ఎన్టీఆర్‌కు భారత రత్న అవార్డు ఇవ్వడంపై తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. త్వరలోనే హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. ఫోన్ ట్యాపింగ్ విచారణ జరుగుతోందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎంత నష్టం జరిగిందో.. అంచనా కోసం కమిటీకి బాధ్యతలు అప్పగించామని పేర్కొన్నారు. కమిటీ నివేదిక అందిన తర్వాతే కాళేశ్వరంపై ఆలోచిస్తామని సీఎం

...:: మిగతా 2లో

'పుర' ఉత్కంఠకు నేడు తెర

జోరందుకున్న క్యాంపు రాజకీయాలు



- అభ్యర్థులను కాపాడుకునే పనిలో నేతలు
- ఆసక్తికరంగారాష్ట్ర రాజకీయాలు
- రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ
- మరోసారి అధికస్థానాలు మావే ధీమాలో కాంగ్రెస్
- ఈసారి ఎక్కువ స్థానాల్లో గెలుపొందుతాం: బీఆర్ఎస్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 12 : నేడు పుర పోరుకు తెరపడనుంది. ఉదయం ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల భవితవ్యం బయటపడనుంది. రాష్ట్రంలో పురపాలక ఎన్నికలు పూర్తయ్యాయి. ఇక అభ్యర్థుల ఫలితాలు వెలువడటమే మిగిలింది. ఈ నేపథ్యంలో తమ అభ్యర్థులు చేజారిపోకుండా అన్ని పార్టీలు అప్రమత్తమయ్యారు. ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో పలుచోట్ల క్యాంపు రాజకీయాలు జోరందుకున్నాయి. ఫలితాల వెల్లడి

...:: మిగతా 2లో



'మూసీ' ప్రాజెక్టుకు 100 ఎకరాలివ్వండి

- 'గాంధీ సరోవర్' శంకుస్థాపనకు రండి
- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి
- కృష్ణా-వికారాబాద్ రైలు మార్గం నిర్మించండి
- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు విజ్ఞప్తి
- పనులు వేగవంతమే లక్ష్యంగా సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటన

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 : మూసీ పునరుజ్జీవం, రైలు మార్గాల మంజూరు, విమానాశ్రయాల పనులు వేగవంతమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగింది. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడులతో గురువారం ముఖ్యమంత్రి వరుసగా భేటీ అయ్యారు. ఆయా ప్రాజెక్టులకు

...:: మిగతా 2లో

రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు వెనక్కి తీసుకునే వరకు

ఐక్యంగా పోరాడుదాం

- ఎస్కేఎం రాష్ట్ర కన్వీనర్ల పిలుపు
- ఇందిరాపార్క్ వద్ద జరిగిన సభ

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 12: కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలు వెనక్కి తీసుకునే వరకు ఐక్యంగా పోరాడుదాం అని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) రాష్ట్రకన్వీనర్లు టీ సాగర్, పశ్య పద్మ, వి ప్రభాకర్,మండల వెంకన్న, ఆర్ వెంకట్రాములు, జక్కుల వెంకటయ్య, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, పిలుపునిచ్చారు. గురువారం సార్వత్రిక సమ్మె సందర్భంగా ఆర్టీసీ కళ్యాణ మండపం నుండి ఇందిరాపార్క్ వరకు కార్మిక సంఘాలతో కలిపి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరాపార్క్ దగ్గర జరిగిన సభలో వారు మాట్లాడుతూ... భారతదేశం అమెరికాతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, 4 లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, విద్యుత్ బిల్లు 2025, విత్తన బిల్లు 2025

...:: మిగతా 2లో





18 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు ధాన్యం తీసుకోండి

- యాసంగి ధాన్యం సేకరణ గడువు పొడిగించండి
- బాయిల్డ్ రైస్‌లో అయిదు శాతం నూకకు అనుమతించండి
- 2014-15 బకాయిలు రూ.1,468.94 కోట్లు విడుదల చేయండి
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ వినతి

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: వానాకాలం పంటకు (2025-26 సీజన్) సంబంధించి తాము అదనంగా సేకరించిన 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎఫ్‌సీఐ తీసుకోవాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం కలిశారు. వానా కాలం పంటకు సంబంధించి 53.73 లక్షల మెట్రిక్ టన్నులకు (ఎల్ఎంటీ) అనుమతించారని.. కానీ భారీగా పంట ఉత్పత్తి కావడంతో అదనంగా 18 ఎల్ఎంటీలు తాము సేకరించినందున

...:: మిగతా 2లో

రాష్ట్రంలో 44వేలకు పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

- మరింత పారదర్శకంగా ప్రక్రియ
- అర్హులందరికీ న్యాయం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి12: రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల

...:: మిగతా 2లో



మధ్యతరగతిని అణచివేయడం కాదు

వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు పెరగడం అంటే మధ్యతరగతి ప్రజలను అణచివేయడం కాదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. రాజ్యసభలో 2026-27 కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలపై ఆమె వ్యాఖ్యానించారు.

9



బంగ్లాదేశ్‌లో పార్లమెంట్ పోలింగ్

బంగ్లాదేశ్‌లో గురువారం 13వ జాతీయ పార్లమెంట్ ఎన్నికల ఓటింగ జరిగింది. మాజీ ప్రధాని షేక్ హసీనా కూలిపోయిన తర్వాత ఏర్పడిన తాత్కాలిక పాలనకు ఈ ఎన్నికలు ముగింపు పలకనున్నాయి.

9



'వందే మాతరం' తప్పనిసరి.. మతస్వేచ్ఛపై దాడి

అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం వందేమాతరం పాడడాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై ప్రముఖ ముస్లిం సంస్థ జమియత్ ఉలామా-ఇ-హింద్ మండిపడింది. ఈ నిర్ణయం ఏకపక్షమని అభివర్ణించింది

9



దేశ ప్రజల ఎదురు చూపుల ఫలితం

బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ వేళ తదుపరి ప్రధాని అయ్యే అవకాశం ఉందని భావిస్తున్న బీఎన్‌పీ ఛైర్మన్, మాజీ ప్రధాని ఖలిదా జియా కుమారుడు రహమాన్ ఢాకాలో ఓటు వేశారు.

9

రాజకీయం

నేనే రాజు, నేనే మంత్రిని!

మొదటిపేజీ తరువాయి

రేవంత్ రెడ్డి చెప్పారు.

కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఏమైంది: సీఎం రేవంత్

కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాలని కేంద్రాన్ని కోరామన్నారు. కానీ ఈ అంశాన్ని కేంద్రం పెండింగ్‌లో పెట్టిందని తెలిపారు. ఈ అంశంలో సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. అయితే కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో మూడు పిల్లర్లు మాత్రమే కూలాయని చెప్పడం పద్ధతి కాదని అభిప్రాయ పడ్డారు. ప్రాజెక్ట్ లోపల బాంబు పెడితే పైన పేలుతుంది.. కింద కూలదని స్పష్టం చేశారు. మూడు పిల్లర్లా?.. ముప్పయ్ పిల్లర్లా? అనేది కమిటీ నిర్ధారించిన తర్వాత చెబుతామని చెప్పారు. కృష్ణా జలాలపై తాము అడిగిన వన్నీ ఇస్తే ఆంధ్రప్రదేశ్‌కి సైతం సహకరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. కవిత పార్టీ గురించి తమకు తెలియదన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి..

ఎన్టీఆర్ జాతీయ నాయకుడు.. ఆయన ఏ ఒక్కరికి సొత్తు కాదని.. జాతీయ సొత్తు అని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని తాను వ్యక్తిగతంగా డిమాండ్ చేస్తున్నానన్నారు. ఎన్టీఆర్ గురించి ఎవరైనా తక్కువగా మాట్లాడితే వారంతా మూర్ఖులు ఎవరు ఉండరన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఎన్టీఆర్ విగ్రహం పెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దత్తపుత్రుడని పునరుద్ఘాటించారు. కాళేశ్వరంపై 48 గంటల్లో విచారణ చేయిస్తామని కిషన్ రెడ్డి గతంలో ప్రకటించారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించలేదంటూ కిషన్‌రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. కాళేశ్వరంపై తాము నేరుగా సీబీఐ డైరెక్టర్‌కు లేఖ రాశామని వివరించారు.

ప్రభాకర్‌రావు విచారణ తర్వాతే..

జడ్జీలు, జర్నలిస్టులు, రాజకీయ నేతల ఫోన్లు సైతం ట్యాప్ చేశారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కారకుడు ప్రభాకర్‌రావు 20 నెలలపాటు విదేశాలకు పారిపోయారని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలతోనే ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును స్వదేశానికి తీసుకొచ్చామని వివరించారు. ప్రభాకర్‌రావు విచారణ తర్వాతే ఒక్కొక్కరికి సిట్ నోటీసులు జారీ చేస్తోందన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ఎస్ఐబీలో కంప్యూటర్లు, హార్డ్ డిస్కులు ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును తెలంగాణ హైకోర్టు.. సుమోటోగా స్వీకరించి విచారణ చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఐక్యంగా పోరాడుదాం

మొదటిపేజీ తరువాయి

ఉపసంహరించాలని, వీబీజీ రాం జీ చట్టం 2025 ను రద్దు చేయాలని, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని, స్కీమ్ వర్కర్లు సహా కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం రైతులు, కార్మికులు , సామాన్య ప్రజలపై ప్రారంభించిన కొత్తదాడులన్నింటినీ ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ బిల్లు 2025 రైతులకు , గృహ వినియోగదారులకు విద్యుత్ రేట్లను పెంచుతుంది , పీక్ అవర్ ఛార్జీలు స్మార్ట్ మీటర్లను విధిస్తుంది. బీజేపీ ఎన్నికల ప్రచారాలలో కూడా హామీ ఇచ్చినట్లుగా స్మార్ట్ మీటర్లను అందరికీ 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామసభలు నిర్ణయించిన విధంగా గ్రామీణ ప్రజలకు పని హామీ ఇచ్చే ఎంజీ నరేగాను రద్దు చేస్తూ వీబీజీ రాం జీ చట్టాన్ని విధించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. బహుళ జాతి కంపెనీల విత్తనాలను దిగుమతి చేసుకోవడం, ఇష్టానుసారంగా వసూలు చేసే స్వేచ్ఛ , విత్తనాల బ్లాక్ మార్కెటింగ్ చేయడానికి అనుమతించే కొత్త విత్తన బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

మోడీ ప్రభుత్వం భారతదేశం యొక్క సార్వభౌమత్వాన్ని , స్వావలంబనను అమెరికాకు అప్పగించిందని. 385 రోజుల పాటు కొనసాగిన చారిత్రాత్మక రైతుల పోరాటం నేపథ్యంలో డిసెంబర్ 9, 2021 నాటి లేఖలో కేంద్ర ప్రభుత్వం వాగ్దానం చేసిన అన్ని అంశాలపై పోరాటాన్ని కొనసాగిస్తామని, డబ్ల్యుటీఓ, ఎంఎన్సీలు దేశీయ కార్పొరేట్ కంపెనీల ఒత్తిడితో హామీ ఇవ్వబడిన పంటల సేకరణ, పూర్తి రుణ మాఫీ , విద్యుత్ హక్కుతో అన్ని పంటలకు సీ2+50% ఎంఎస్పీ కోసం చట్టాన్ని అమలు చేయడంపై మోడీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఒప్పందాన్ని అమలు చేయలేదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే యం నాయకులు జి నాగయ్య, బి రాము, విస్సా కిరణ్, పి జంగారెడ్డి అరిబండి ప్రసాద్ రావు, మూడ్ శోభన్, బొప్పని పద్మ, ప్రజా సంఘాల నాయకులు అరుణ జ్యోతి,ఆశాలత, కోట రమేష్,మారన్న,రాము,జావెద్ తదితరులు పాల్గొన్నారు.

18 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు ధాన్యం తీసుకోండి

మొదటిపేజీ తరువాయి

ఆ మొత్తాన్ని 10 శాతం నూకతో ఎఫ్ సీఐ సేకరించాలని కేంద్ర మంత్రికి వారు విజ్ఞప్తి చేశారు. 2024-25 యాసంగి పంటకు సంబంధించి 5 శాతం నూకతో అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుమతించాలని కేంద్ర మంత్రి జోషిని సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ కోరారు. 2024-25 వానా కాలం పంటకు సంబంధించి కస్టమ్స్ మిల్లింగ్ రైస్‌కు ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకు గడువు నిర్దేశించారని, దానిని మరో రెండు నెలలు పాటు పొడిగించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. భారత ఆహార సంస్థకు (ఎఫ్‌సీఐ) 2014-15 వానా కాలంలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణకు బకాయి పెట్టిన రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని సీఎం, రాష్ట్ర మంత్రి కోరారు. నాడు అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని కేంద్ర మంత్రి దృష్టికి వారు తీసుకెళ్లారు. నాడు సేకరణకు తాము రుణం తీసుకున్నామని.. దానికి వడ్డీ రూ.2 వేల కోట్లకుపైగా పెరిగిందని తెలియజేశారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద 2021, మే నుంచి 2022, మార్చి వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం, 2022 ఏప్రిల్ నెలలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రికి సీఎం, రాష్ట్ర మంత్రి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.



44వేలకు పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్‌వో మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు. 2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు , 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజెన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు. అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 , డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.





'మూసీ' ప్రాజెక్టుకు 100 ఎకరాలివ్వండి

మొదటిపేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వ అనుమతులు, భూ బదలాయింపులు, నిధుల మంజూరును కోరుతూనే రాష్ట్ర ప్రభుత్వపరంగా ఇవ్వనున్నమద్దతు, భూ కేటాయింపులను కేంద్ర మంత్రులకు సీఎం వివరించారు. ఈసా, మూసీ నదుల సంగమ స్థలిలో నిర్మించనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. కేంద్ర మంత్రితో సౌత్ బ్లాక్‌లోని ఆయన కార్యాలయంలో ముఖ్యమంత్రి గురువారం భేటీ అయ్యారు. సుస్థిర పట్టణాభివృద్ధి లక్ష్యాలతో, పర్యావరణ హితంగా, స్వచ్ఛమైన నీటితో నది ప్రవహించేలా మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపడుతున్నట్లు రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన 100 ఎకరాల రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీ కృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాసరాజు, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

కృష్ణా-వికారాబాద్ రైలు మార్గం నిర్మించండి

కృష్ణా, వికారాబాద్ రైలు మార్గాన్ని పూర్తిగా కేంద్ర నిధులతో చేపట్టాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ వ్యయం మొత్తాన్ని తామే భరిస్తామని, ఇప్పటికే తెలియజేసిన విషయాన్ని సీఎం కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం భేటీ అయ్యారు. ఈ మార్గంలోని టేకల్‌కోడ్‌లో లైమ్ స్టోన్ నిక్షేపాలను గుర్తించామని.. సిమెంట్, జౌళి పరిశ్రమల కేంద్రంగా దానిని అభివృద్ధి చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు సీఎం కేంద్ర మంత్రికి తెలియజేశారు. కొడంగల్, టేకల్‌కోడ్, దౌల్తాబాద్‌లను పారిశ్రామిక జోన్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం వివరించారు.

హైస్పీడ్ రైలు కారిడార్లకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ సమీపంలో 500 ఎకరాల స్థలం కేటాయిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు తెలియజేశారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న



శంషాబాద్ నుంచే హైస్పీడ్ రైలు మార్గాలని ప్రారంభించాలని సీఎం సూచించారు. హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్ అమరావతి మీదుగా వెళుతుందని, అక్కడి నుంచి బందరు పోర్టుకు రైలు మార్గం మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-పుణే హైస్పీడ్ కారిడార్లు శంషాబాద్ నుంచే మొదలు పెడితే అది ట్రై జంక్షన్ అవుతుందని సీఎం రైల్వే మంత్రికి వివరించారు. ఈ మూడు కారిడార్లకు భూ సేకరణ వెంటనే చేపట్టి పనులు ప్రారంభించాలని రైల్వే శాఖ మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలత వ్యక్తం చేశారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో...
మమూనురు ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించాలి..

తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ కు సమీపంలో నిర్మించనున్న మామూనూరు ఎయిర్‌పోర్ట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం భేటీ అయ్యారు. మామూనూరు ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణ పూర్తయినందున వెంటనే పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. మామూనూరు ఎయిర్‌పోర్ట్‌లో కార్గో సేవలతో పాటు మెయింటెనెన్స్.. ఓవర్ హాల్ రిపేర్ (ఎంఆర్ఓ) సదుపాయాలు ఉండేలా చూడాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. జౌళి, ఇతర పరిశ్రమలతో వరంగల్ నగరం పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని, వరంగల్‌కు దగ్గరలో రెండేళ్లకోకసారి ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క,సారలమ్మ జాతర మేడారంలో జరుగుతుందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. ఆ విమానాశ్రయ ఏర్పాటుకు అదనంగా అవసరమైన 249.82 ఎకరాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. వెంటనే అనుమతుల మంజూరు చేయాలని కోరారు. మామూనూరు ఎయిర్‌పోర్ట్ పనుల ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులను అక్కడకు పంపిస్తానని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హామీ ఇచ్చారు.

స్థానిక ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు..

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనేతలకు తెలియజేశారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధ, గురువారాల్లో వేర్వేరుగా భేటీ అయ్యారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 70 శాతానికి ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి దక్కాయని, విపక్ష బీఆర్ఎస్, బీజేపీలు పెద్దగా ప్రభావం చూపలేదని సీఎం తెలియజేశారు. అందుకు సంబంధించిన నివేదికలను సీఎం అగ్ర నేతలకు అందజేశారు. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికలు బుధవారం జరిగాయని.. శుక్రవారం ఫలితాలు వెలువడనున్నాయని వారికి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ మెరుగైన ఫలితాలు రాబడుతుందని ధీమా వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయి ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలు సాధించడంపై అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ఖర్గే, కేసీ వేణుగోపాల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు.









'పుర' ఉత్కంఠకు నేడు తెర

మొదటిపేజీ తరువాయి

అనంతరం అభ్యర్థులు చేజారిపోకుండా ఉండేందుకు అభ్యర్థులతో ఆయా పార్టీల కీలక నేతలు సమావేశాలను నిర్వహిస్తున్నారు. వారికి పలు కీలక సూచనలు చేస్తున్నారు. ఆయా పార్టీల నేతలు క్యాంపు రాజకీయాల్లో తలమునకలై ఉన్నారు.

జోరందుకున్న క్యాంపు రాజకీయాలు

ఆదిలాబాద్, నిర్మల్ మున్సిపల్ పరిధిలో క్యాంపు రాజకీయాలకు తెర లేచింది. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బరిలో నిల్చున్న అభ్యర్థులను దూర ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తన క్యాంపు కార్యాలయానికి అభ్యర్థులను పిలిపించి ప్రత్యేక బస్సుల్లో వారిని తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో పట్టణ శివారులోని ఫంక్షన్‌హాల్‌లో అభ్యర్థులతో సమావేశమయ్యారు. వారిని ఎక్కడికి తరలించాలో సమాలోచన చేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను మాజీ మంత్రి జోగు రామన్నసైతం క్యాంపునకు పంపించే ఆలోచనలో ఉండటంతో రేపటి ఫలితాలు ఆసక్తిని రేపుతున్నాయి. అటు నిర్మల్‌లో బీజేపీ మహేశ్వర్ రెడ్డి నివాసంలో 42 మంది అభ్యర్థులతో సమావేశం నిర్వహించి వారిని క్యాంపునకు తరలించారు.

బీఆర్ఎస్ అప్రమత్తం

మరోవైపు సూర్యాపేటలో క్యాంపు రాజకీయాలు జోరందుకున్నాయి. రేపు ఎన్నికల ఫలితాల దృష్ట్యా బీఆర్ఎస్ అప్రమత్తమైంది. 48 వార్డులకు చెందిన ఆపార్టీ అభ్యర్థులను మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి క్యాంపునకు తరలించారు. పార్టీ ఫిరాయింపులను అడ్డుకునే వ్యూహంలోనే ముందస్తు చర్యలు చేపట్టినట్లుగా తెలుస్తోంది. ఈ సందర్భంగా అభ్యర్థులకు పలు కీలక సూచనలు చేసినట్లు సమాచారం. మరోవైపు బీఆర్ఎస్ నేతలతో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌టెలికాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. పురపాలక ఎన్నికల్లో బాగా పనిచేశారని నేతలు, శ్రేణులను ఆయన అభినందించారు. ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేసిన కేటీఆర్ కొన్నిమున్సిపాల్టీలను సొంతంగా గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మరికొన్ని చోట్ల క్రియాశీలకంగా ఉంటామన్నారు. పార్టీ అభ్యర్థులతో క్యాంపులను నిర్వహించి నేతలకు కేటీఆర్ పలు కీలక సూచనలు చేశారు. విప్ జారీ సహా అన్ని అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. పలు అంశాలపై పార్టీ నేతలతో మాట్లాడారు.

నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం..

పురపాలక ఎన్నికలు పూర్తయ్యాయి. మొత్తం 73.01 శాతం పోలింగ్ నమోదైంది. పురుషులకంటే అధికంగా మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నేడు ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. ఏ పార్టీ ఎన్నిస్థానాల్లో గెలుపొందుతుందనే దానిపై రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ఈ ఎన్నికలను అన్ని పార్టీల నేతలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. మరోసారి అధిక స్థానాల్లో గెలుపొందేది తామేనన్న ధీమాలో కాంగ్రెస్ పార్టీ ఉండగా, ఈసారి తమ పార్టీ ఎక్కువ స్థానాల్లో గెలుపొందుతుందని బీఆర్ఎస్ పార్టీ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. తాము కూడా ఎక్కువ స్థానాల్లో గెలుపొందుతామని బీజేపీ పార్టీ నేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. మరి ఏ పార్టీకి ప్రజలు పురపోరులో పట్టం కడతారు అనేది తెలుసుకోవాలంటే కొన్ని గంటలు వేచి చూడాల్సిందే. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని తమ అభ్యర్థులు పార్టీ ఫిరాయించకుండా ఉండేందుకు అన్ని రాజకీయపార్టీలు చర్యలు చేపట్టాయి. ఈ నేపథ్యంలోనే వారిలో కీలక నేతలు మంతనాలు సాగిస్తున్నారు. కొన్నిచోట్ల అభ్యర్థులను క్యాంపులకు తరలిస్తున్నారు. ఫలితాలు వెలువడనున్న వేళ రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.



బీసీ ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు, గురుకులాల్లో త్వరలోనే మెస్ ఛార్జీలు పెంచుతాం. విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం. నోడల్ శాఖ ఆధ్వర్యంలో ఛార్జీల పెంపుపై నిర్ణయం తీసుకుంటాం. 2014-19 మధ్య కాలంలోనూ అప్పటి టీడీపీ ప్రభుత్వం 66% మేర మెస్ ఛార్జీలు పెంచింది.

- అసెంబ్లీలో
ఏపీ మంత్రి సవిత

కార్మిక, కర్షక వ్యతిరేకి మోడీ

- భారత్ సమ్మెలో టీపీసీసీ చీఫ్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 12: ఇందిరా పార్క్ వద్ద ఇండియా-అమెరికా ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా కార్మిక, కర్షక సంఘాలు భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించాయి. ఈ నిరసన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ పాల్గొని సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ, దేశీయ పరిశ్రమలు, చిన్న మరియు మధ్య తరహా వ్యాపారాలు, రైతులు, కార్మికుల ప్రయోజనాలను పణంగా పెట్టే విధంగా ఏ వాణిజ్య ఒప్పందం ఉండకూడదని స్పష్టం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాల్సిన సమయంలో విదేశీ కంపెనీలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో తీవ్ర ప్రభావాలు చూపుతాయని హెచ్చరించారు.ఇండియా-అమెరికా వాణిజ్య ఒప్పందం అమలులోకి వస్తే వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింటుందని, రైతుల ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్ పోటీకి గురై కనీస ధర కూడా దక్కకుండా పోవచ్చని కార్మిక, కర్షక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. కార్మిక హక్కులు, వేతన భద్రత, ఉద్యోగ రక్షణ అంశాల్లో స్పష్టత లేకుండా ఒప్పందాలు కుదుర్చుకోవడం సమంజసం కాదన్నారు.దేశీయ పరిశ్రమలను రక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించకుండా విదేశీ దిగుమతులకు మార్గం సుగమం చేస్తే చిన్న వ్యాపారులు నష్టపోతారని ఆయన పేర్కొన్నారు. రైతు, కార్మిక వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా తీసుకునే ఏకపక్ష నిర్ణయాలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సమర్థించదని తెలిపారు.కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, ఈ ఒప్పందం ద్వారా కార్మిక చట్టాల్లో సడలింపులు, ప్రైవేటీకరణ వేగవంతం అవుతాయని భయం వ్యక్తం చేశారు. వ్యవసాయ సబ్సిడీలు, కనీస మద్దతు ధర వ్యవస్థపై ప్రభావం పడే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. దేశ ప్రయోజనాలను కాపాడే విధంగా పారదర్శక చర్చల తర్వాతే ఏ వాణిజ్య ఒప్పందమైనా కుదుర్చుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.

మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు

- అర్హులందరికి పోషకాహారం
- అందేలా చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క ఆదేశాలు
- టేక్ హోం రేషన్ విధానంలో సరకులు అందచేసేలా చర్యలు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 12: హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ పరిధిలో వలస కార్మికులు అధికంగా నివసించే ప్రాంతాలు, బస్తీలు, స్లమ్ ప్రాంతాల్లో అంగన్‌వాడీ సేవలు అందని అర్హుల కోసం రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. భవనాల కొరత, సాంకేతిక సమస్యలు, అలాగే కొత్త అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు పై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షల నేపథ్యంలో మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు దిశగా తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ కసరత్తులు ప్రారంభించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో కలిపి ప్రస్తుతం 2,364 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. అయితే శాఖ నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో హెచ్‌ఎండీఏ పరిధిలోని 274 కవర్ కాని బస్తీల్లో 25,310 మంది అర్హులైన చిన్నారులు, గర్భిణీలు, బాలింతలను గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో వీరికి పోషకాహార సేవలు సక్రమంగా అందడం లేదని వెల్లడైంది. అధిక జనసాంద్రత, తరచు వలసలు, నిబంధనల పరిమితులు, బస్తీల్లో భవనాల లభ్యత లేకపోవడం, సాంకేతిక అడ్డంకులు వంటి కారణాల వల్ల కొత్త అంగన్‌వాడీ కేంద్రాల స్థాపనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో "ఏ ఒక్క అర్హుడు కూడా నష్టపోకూడదు, పోషకాహారానికి ఆటంకం కలగకూడదు" అని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాలలో భాగంగా పోషక లోప రహిత తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. అర్హులందరికీ అంగన్‌వాడీ సేవలు అందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని మంత్రి ఆదేశించారు. టేక్ హోం రేషన్ విధానంలో అర్హుల నివాసాలకే సరుకులు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో బాలమృతం, పాలు, స్నాక్స్, కోడి గుడ్లు, బియ్యం తదితర పోషకాహార పదార్థాలను పంపిణీ చేయనున్నారు. ఈ ప్రణాళికలో భాగంగా 274 స్లమ్ ప్రాంతాలను కవర్ చేస్తూ 37 వాహనాలను అద్దెకు తీసుకుని మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ మొబైల్ కేంద్రాలను సమీప అంగన్‌వాడీ కేంద్రాలకు అనుబంధంగా నిర్వహిస్తారు. మొబైల్ అంగన్‌వాడీ వాహనాల ద్వారా ఆయా ప్రాంతాల్లోని అర్హులకు పోషకాహారాన్ని అందచేయనున్నారు. ఈ కార్యక్రమం అమలుకు సంవత్సరానికి సుమారు రూ.4 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు. అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే మొబైల్ అంగన్‌వాడీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా పోషకాహార సేవలు అర్హులందరికి అందాలని, సాంకేతిక సమస్యలతో ఏవరూ నష్టపోకూడదన్న లక్ష్యానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మంత్రి సీతక్క తెలిపారు.

సమ్మక్క–సారలమ్మ జాతరలో
మహిళా సంఘాలకు భారీ ఆదాయం

- రూ. 6 కోట్ల పెట్టుబడి..రూ. 3 కోట్ల లాభం
- ఇందిరా మహిళా శక్తి ఘన విజయానికి నిదర్శనం:- మంత్రి సీతక్క



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రదరి 12: సమ్మక్క-సారలమ్మ మహా జాతర-2026 సందర్భంగా ములుగు జిల్లాలో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లు భారీ ఆదాయాన్ని ఆర్జించాయి. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లాలోని 10 మండలాలను కవర్ చేస్తూ మొత్తం 565 ఆదాయ యూనిట్లను ఎస్హెచ్‌జీల ద్వారా ఏర్పాటు చేయగా వారు జాతర సమయంలో రూ.3 కోట్లకు పైగా ఆదాయాన్ని సంపాదించారు. మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకుని మేడారం జాతర ప్రాంగణంలో మహిళా సంఘాలకు అనుకూలమైన ప్రదేశాల్లో షాపులను కేటాయింప చేశారు. ములుగు జిల్లాలోని పది మండలాలకు చెందిన మహిళా సమాఖ్యల ద్వారా వివిధ రకాల వ్యాపార యూనిట్లు ఏర్పాట్లు చేయించి మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గాలు కల్పించారు. మంత్రి సీతక్క స్వయంగా ఈ యూనిట్లను ప్రారంభించి వారి బిజినెస్ కు విస్తృత ప్రచారం కల్పించారు. ప్రభుత్వ ప్రోత్సాహకం, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు కల్పించడంతో మహిళలు కూల్ డ్రింక్ సెంటర్లు, చికెన్ సెంటర్లు, ఇప్ప పువ్వు లడ్డూ స్టాళ్లు, బ్యాంబూ చికెన్, క్యాంటిన్లు, స్నాక్స్ తదితర దుకాణాలను ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన స్టాళ్లు, ఇతర వ్యాపార కార్యకలాపాల ద్వారా మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సమర్థంగా వినియోగించుకుని ఆర్థికంగా లాభపడ్డారు. ఈ వ్యాపారాల కోసం రూ.6 కోట్ల పెట్టుబడిని బ్యాంకులు, జిల్లా మహిళా సమాఖ్యల ద్వారా సమకూర్చగా.. మొత్తం రూ.9.12 కోట్ల ఆదాయం లభించింది. పెట్టుబడి ఖర్చులు పోగా రూ.3 కోట్లకుపైగా లాభం వచ్చింది. ప్రభుత్వ ప్రోత్సాహకం, మహిళా సంఘాల పట్టుదల, ఆడ బిడ్డల శ్రమ ఫలితమని అభినందించారు. గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలపడుతూ స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగుతున్న ఈ ప్రయాణం దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆమె పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు దృఢమైన పునాది వేసిందని మంత్రి ప్రశంసించారు.

ఉగాదికి సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభం

- మార్చి రెండో వారానికల్లా పనులన్నీ పూర్తి చేయాలి
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- ఏర్పాట్లపై మంత్రి మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 12: పేదలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్ (టిమ్స్) ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఉగాది పండుగ రోజున ఈ హాస్పిటల్‌ను ప్రారంభించి ప్రజలకు అంకితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈలోగా సివిల్ పనులు, ఎక్విప్‌మెంట్ ట్రయల్స్ అన్నీ పూర్తి చేసి, హాస్పిటల్‌ను వైద్య సేవలు అందించేందుకు సిద్ధం చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీస్‌లో టిమ్స్ సనత్‌నగర్ పనుల పురోగతి, డాక్టర్లు, సిబ్బంది నియామకంపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓపీ రూమ్‌లు, డయాగ్నస్టిక్స్, ఇన్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్లు, వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూల ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. 1000 బెడ్ల కెపాసిటీతో నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్‌లో మౌలిక వసతుల కల్పన తుది దశకు చేరుకుందని అధికారులు మంత్రికి వివరించారు. హాస్పిటల్ అత్యంత కీలకమైన 16 ఆపరేషన్ థియేటర్లు (ఓటీఎస్) శస్త్రచికిత్సలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రోగ నిర్ధారణ కోసం అత్యాధునిక సీటీ స్కాన్ , ఎంఆర్ఐ , డిజిటల్ ఎక్స్‌రే మిషన్ల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. డయాగ్నస్టిక్స్ యంత్రాలు ఇన్‌స్టాలేషన్ జరుగుతోందన్నారు. మార్చి రెండో వారం నాటికి అన్ని పనులు, ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటల్ ప్రారంభమయ్యే నాటికి టెక్నీషియన్లకు, సిబ్బందికి ట్రైనింగ్ కూడా పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

నాన్ మెడికల్ సర్వీసెస్‌పై స్పెషల్ ఫోకస్

హాస్పిటల్ నిర్వహణకు అవసరమైన ప్రొఫెసర్లు, డాక్టర్లు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది నియామక ప్రక్రియపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆరా తీశారు. పూర్తిగా కొత్త హాస్పిటల్ అయినందున..డీఎంఈ, నిమ్స్ పరిధిలోని సీనియర్ డాక్టర్ల సేవలను సనత్‌నగర్ టిమ్స్‌లో వినియోగించుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. అలాగే, పారిశుధ్యం, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సేవలను అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ విషయంలో ఇప్పటికే నగరంలోని పలు కార్పొరేట్ హాస్పిటల్స్, నిమ్స్, ఎయిమ్స్‌లో అనుసరిస్తున్న పద్ధతులను డీఎంఈ నేతృత్వంలోని కమిటీ అధ్యయనం చేసి, నివేదిక అందజేసింది. ఆయా హాస్పిటల్స్‌లో అవలంభిస్తున్న బెస్ట్ ప్రాక్టీస్ విధానాలనే టిమ్స్‌లోనూ అమల్లోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. మెడికల్ సర్వీసెస్‌తో పాటు సానిటేషన్, సెక్యూరిటీ వంటి నాన్ మెడికల్ సర్వీసెస్ విభాగాలు కూడా పటిష్టంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.

టెక్నాలజీతో మెరుగైన సేవలు..

రోగులకు ఓపీ రిజిస్ట్రేషన్ నుంచి డిశ్చార్జి వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈహెచ్‌ఎంఐఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా సేవలను అనుసంధానించాలని మంత్రి సూచించారు. రోగులకు, వారి సహాయకులకు నాణ్యమైన భోజనం అందించేందుకు సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. మార్చి 15 నాటికి పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న పనులన్నీ పూర్తి చేసి, ఉగాది నాటికి హాస్పిటల్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

వచ్చే నెలలో మండల, జడ్పీ ఎన్నికలు

- ఎన్నికల ఏర్పాట్లలో రాష్ట్ర ఎన్నికల సంఘం
- రూ.450 కోట్లు నిధుల విడుదలపై కసరత్తు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 12: తెలంగాణ రాష్ట్రంలో జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలను మార్చి నెలలో నిర్వహించే దిశగా ప్రభుత్వం ఆలోచనలు వేగవంతం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మునిసిపల్ ఎన్నికల ఫలితాలు అనుకూలంగా వస్తే అదే ఊపును కొనసాగిస్తూ పరిషత్ ఎన్నికలకు వెళ్లాలన్న వ్యూహంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఎన్నికలు పూర్తి చేయాలన్న ఆవశ్యకత ప్రభుత్వం ముందు నిలిచింది. ఈ ఏడాది లోపల పరిషత్ ఎన్నికలు నిర్వహించకపోతే జిల్లా, మండల పరిషత్‌లకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన సుమారు రూ.450 కోట్ల నిధులు నిలిచిపోయే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నట్లు సమాచారం. అభివృద్ధి కార్యక్రమాలపై దాని ప్రభావం పడే అవకాశముండటంతో ఎన్నికల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలనే దిశగా యంత్రాంగం చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రాథమిక స్థాయి సన్నాహాలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. మార్చి తొలి వారంలో రెండు విడతలుగా ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై పరిశీలన కొనసాగుతోందని అధికార వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘంతో సమన్వయం సాధించి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. రాజకీయ పరంగా కూడా ఈ ఎన్నికలు కీలకంగా మారనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బలాన్ని నిరూపించుకోవడానికి ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే వ్యూహరచనలో నిమగ్నమయ్యాయి. మునిసిపల్ ఎన్నికల ఫలితాల ప్రభావం పరిషత్ ఎన్నికలపై పడే అవకాశం ఉండటంతో అన్ని పార్టీల దృష్టి ఇప్పుడు గ్రామీణ ఓటర్లపై కేంద్రీకృతమైంది. మొత్తంగా చూస్తే ఆర్థిక పరిమితులు, రాజకీయ లెక్కలు - రెండూ కలిసివచ్చే నేపథ్యంలో రాష్ట్రంలో పరిషత్ ఎన్నికల వేడి త్వరలోనే మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత రానుంది.



సీఎంను కలిసిన రైట్స్ సంస్థ ప్రతినిధులు

- హైస్పీడ్ కారిడార్ల అలైన్‌మెంట్లు, డీపీఆర్‌పై ప్రజంటేషన్
- పలు సూచనలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: హైదరాబాద్ - బెంగళూర్, హైదరాబాద్ - చెన్నై హైస్పీడ్ కారిడార్ల అలైన్‌మెంట్లకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ కన్సల్టెంట్ (రైట్స్) సంస్థకు పలు సూచనలు చేశారు. ఇటీవల కేంద్ర బడ్జెట్ లో ప్రకటించిన హైస్పీడ్ రైలు కారిడార్ల నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ తయారీ బాధ్యతను రైల్వే శాఖ రైట్స్ కన్సల్టెన్సీ సంస్థకు అప్పజెప్పింది. ఆ సంస్థ ప్రతినిధులు ఢిల్లీలోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో ఇందుకు సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అలైన్‌మెంట్లు, డీపీఆర్‌కు సంబంధించి వారు చేసిన ప్రతిపాదనలను పరిశీలించిన ముఖ్యమంత్రి పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కేవస్ శ్రీనివాసరాజు, సెక్రటరీ కో ఆర్డినేషన్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, రైట్స్ (అర్బన్‌ఇన్ఫ్రాస్ట్రక్టర్) ఈడీ లలిత్ కుమార్ పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

- 387 కోట్లు విడుదల చేసిం కేంద్ర ప్రభుత్వం
- పెండింగ్ మొత్తాలను వెంటనే విడుదల చేయాలి
- పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 12: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం కింద కేంద్ర ప్రభుత్వం తాజాగా రూ. 387 కోట్లు విడుదల చేసింది. ఇదివరకే మొదటి విడతగా రూ. 259.36 కోట్లు విడుదల చేసిన కేంద్రం, తాజా విడతతో కలిపి ఇప్పటివరకు మొత్తం రూ. 646.36కోట్లు తెలంగాణ రాష్ట్రానికి అందించినట్లు పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది. రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికలు విజయవంతంగా పూర్తిచేసి, కేంద్ర ప్రభుత్వం కోరిన అన్ని విధాల సమాచారం, నిధుల వినియోగ వివరాలను సమర్పించిన అనంతరం నిబంధనలకు అనుగుణంగా ఈ నిధులు విడుదలైనట్లు అధికారులు పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలు, గ్రామీణ రహదారుల మెరుగుదల వంటి పనులకు ఈ నిధులను వెచ్చించనున్నారు. అయితే 15వ ఆర్థిక సంఘం కింద తెలంగాణకు మొత్తం సుమారు రూ. 3,000 కోట్ల వరకు నిధులు రావాల్సి ఉండగా, ఇప్పటికీ సుమారు రూ. 2,400 కోట్ల వరకు నిధులు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం వెల్లడించింది. గ్రామాల సమగ్రాభివృద్ధి, స్థానిక సంస్థల ఆర్థిక బలోపేతం దృష్ట్యా పెండింగ్ నిధులను ఆలస్యం చేయకుండా వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దానసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వేగవంతం కావాలంటే కేంద్ర రాష్ట్రాల మధ్య సమన్వయం అత్యంత అవసరమని, గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలపరచడం ద్వారా ప్రజలకు సేవలు అందించగలమని మంత్రి తెలిపారు.



ట్రై కార్పొరేషన్.. ప్రజలకు
సుపరిపాలన అందించాలి

- ప్రజా ఆకాంక్షలు నెరవేర్చాలి
- అధికారులు అంకితభావంతో పనిచేయాలి
- జీహెచ్‌ఎంసీ ప్రత్యేక అధికారి జయేష్ రంజన్
- జీహెచ్‌ఎంసీ సాధారణ స్టాండింగ్ కమిటీ సమావేశం

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 12 : ట్రై కార్పొరేషన్ ప్రజలకు సుపరిపాలన అందించాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్ అధికారులకు సూచించారు. గురువారం జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్ లో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జీహెచ్‌ఎంసీ ప్రత్యేక అధికారి అధ్యక్షతన జీహెచ్‌ఎంసీ పునర్వ్యవస్థీకరణ అనంతరం తొలి సాధారణ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. మూడు ఎజెండా అంశాలపై చర్చించారు. కొత్తగా ఏర్పడిన కార్పొరేషన్లకు ప్రత్యేక కార్పొరేట్ హోదా, చట్టబద్ధ హక్కులు ,సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లకు సిబ్బంది కేటాయింపు, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లకు తలా రూ.500 కోట్ల చొప్పున బడ్జెట్ కేటాయింపు వంటి మూడు ప్రతిపాదనలకు స్టాండింగ్ కమిటీ అమోదం తెలిపింది. అనంతరం పనుల పురోగతిపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీవి కర్ణన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం జీహెచ్‌ఎంసీ ప్రత్యేక అధికారి జయేష్‌రంజన్ కమిషనర్, అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, విభాగాల ఉన్నతాధికారులకు నగరంలో పౌర సేవలను మరింత మెరుగుపరిచేందుకు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు దిశా నిర్దేశం చేశారు.

సీజీజీ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్

జీహెచ్‌ఎంసీ మూడు కార్పొరేషన్ గా పునర్వ్యవస్థీకరణ అయిన నేపథ్యంలో అస్సెట్, లయబిలిటీ లు, మ్యాన్ పవర్ ను తార్కికంగా మూడు కార్పొరేషన్ లకు కేటాయించేందుకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు ప్రత్యేక అధికారి తెలిపారు. కేటాయింపులు, ఒప్పందాలు వంటి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా స్టడీ చేసి శాస్త్రీయంగా కేటాయింపులు వచ్చే 10 రోజుల్లో టాస్క్ ఫోర్స్ చేయనుందని తెలిపారు. ఐటీ సహా కొన్ని శాఖల్లో మంచి పనితీరు కనబరిచిన ఫలితాలు రావాలంటే కొంత కాలం వేచి చూడాల్సి వస్తుందన్నారు. కార్పొరేషన్ లో చక్కగా పనిచేస్తే చాలా మట్టుకు ఇన్‌స్టంట్ రిజల్ట్స్, విజిబుల్ ఇంపాక్ట్ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సమావేశంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, అదనపు కమిషనర్లు కేఏ మంగతాయారు, కే సత్యనారాయణ, జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, ప్రియాంక అల, ఎస్ రవి కిరణ్, ఎస్ శ్రీనివాసరెడ్డి , జి ముకుంద రెడ్డి , జలమండలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, ఈడి ఎస్ సామ్రాట్ అశోక్ , చీఫ్ ఇంజనీర్ రత్నాకర్ , జ్యోతి, సీసీపీ కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తిరుమల లడ్డూ వ్యవహారంపై ప్రశ్నించడాన్ని సీఎం చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారు. అందుకే తమ పార్టీ నేతలపై దాడులు చేస్తున్నారు. 'అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపు ఇవ్వడం లేదు. బలం తక్కువ కావడంతో అక్కడ గొంతెత్తలేం. అందుకే మీడియాతో మాట్లాడుతున్నాం. మండలిలో బలం ఉంది కాబట్టి అవగాహనతో బాగా మాట్లాడాలి'

\- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వైసీపీ అధినేత జగన్

ఓపెన్ వాయిస్

స్పీకర్ తీరు ఆక్షేపణీయం

వివాదాస్పద అంశాలు తలెత్తినప్పుడు కూలంకషంగా చర్చించడానికి పార్లమెంట్ సరైన వేదిక కావాలని రాజనీతిజ్ఞులు అభిప్రాయపడుతుంటారు. కానీ ప్రస్తుతం అలాంటి వాతావరణం పార్లమెంట్ సమావేశాల్లో కనిపించడం లేదు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ప్రధాని మోడీ ప్రసంగం లేకుండానే ఫిబ్రవరి 5న ఆమోదం పొందడం పార్లమెంట్ చరిత్రలో అనూహ్య ఘట్టం. దాదాపు 22 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ప్రధాని మోడీ ప్రసంగించకుండానే సభ వాయిదా పడడానికి సంబంధించి ప్రధాని మోడీ కొద్ది క్షణాల్లో ప్రసంగిస్తారనగా, కాంగ్రెస్ ఎంపిలు కొందరు ప్రధాని కుర్చీని చుట్టుముట్టి "అనూహ్యమైన చర్యలు" లేదా భౌతికదాడి చేసే అవకాశం ఉందనే కచ్చితమైన సమాచారం తనకు ఉందని స్పీకర్ ఓం బిర్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. సభలో గందరగోళం మధ్య ప్రధాని గౌరవానికి, భద్రతకు భంగం కలిగించే అవకాశం ఉందని, సభా మర్యాదలు దెబ్బతినకుండా ఉండేందుకు స్పీకర్ బిర్లానే ప్రధాని మోడీని సభకు రావద్దని విజ్ఞప్తి చేశారు. అంతేకాక సభలో ప్రధానికి హాని తలపెట్టే సూచనలు పరోక్షంగా కనిపించడంతో తానే ప్రధానిని రావద్దని ముందుగా హెచ్చరించానని స్పీకర్ బిర్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశ భద్రతకు సంబంధించిన అంశాలు విపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ ప్రస్తావించడం సభలో గందరగోళం సృష్టించింది. స్పీకర్ బిర్లా రాహుల్ గాంధీని తరువాత మాట్లాడ్డానికి ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. మరునాడు సభలో ప్రధాని మోడీ ఉంటే తాము రాహుల్ గాంధీ ప్రస్తావించిన అంశాలపై ప్రశ్నలు అడిగి ఉండేవారమని, దీనికి భయపడే ప్రధాని మోడీ సభకు రాలేదని విపక్షాలు ఆరోపించాయి. ప్రధానిని సభకు రావద్దని కోరడం ద్వారా సభా గౌరవాన్ని, నాయకుడి భద్రతను స్పీకర్ కాపాడారని బీజేపీ నేతలు సమర్థించుకున్నారు. లోక్‌సభ విపక్ష నాయకుడ్ని సభలో మాట్లాడనీయకపోవడం, మరోవైపు ప్రధాని మోడీ ప్రసంగించడానికి సభకు రానీయకపోవడం ఈ రెండూ పార్లమెంటరీ ప్రమాణాలకు వ్యతిరేకమైనవే. అంతేకాకుండా ప్రజాస్వామ్య జవాబుదారీతనానికి తిలోదకాలిచ్చినట్టే అవుతుంది. చర్చసమాధానం పార్లమెంట్ వ్యవస్థలో తప్పనిసరి. దీని ద్వారా కార్యనిర్వాహకవర్గం పార్లమెంట్‌కు జవాబుదారీ అవుతుంది. ప్రధాని కుర్చీ వద్ద అనూహ్యమైన సంఘటనలు జరుగుతాయని విశ్వసనీయమైన సమాచారం అందిందని అందుకే ప్రధానిని రావద్దని తాను విజ్ఞప్తి చేసినని చెప్పడం ఆక్షేపణీయమవుతోంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలపై ప్రధాని సమాధానంతోనే తీర్మానం కావలసి ఉందని పార్లమెంటరీ నిబంధనలు చెబుతున్నాయని, ఒకవేళ ప్రధాని ప్రసంగం లేకుండా చర్చలు ముగించాలని సభ నిర్ణయిస్తే ఆమేరకు ప్రత్యేక తీర్మానం సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందవలసి ఉంటుందని నిబంధనలను ఆయన గుర్తు చేశారు. నరవణె పుస్తకం ముద్రణ అయిందా లేదా అన్నది ఇక్కడ ముఖ్యం కాదు. ఆ పుస్తకంలోని వివాదాస్పద అంశాలపై స్పీకర్ ముందు ప్రామాణీకరించాలని రాహుల్ సిద్ధపడ్డారు. అలాంటప్పుడు తప్పనిసరిగా రాహుల్‌ను సభలో చర్చకు అవకాశం ఇవ్వాల్సి ఉంది. ఆ పుస్తకంలో దేశ భద్రతకు సంబంధించిన తీవ్రమైన అంశాలు ప్రస్తావించి ఉన్నాయి. దీనిపై సభ్యులను చర్చించడానికి ఒప్పుకోకపోవడం జవాబుదారీ నుండి బాధ్యతను తప్పించుకోవడమే అవుతుంది. పార్లమెంట్ బయట రాహుల్ నరవణె పుస్తకం లోని వివాదాస్పద అంశాలను బయటపెట్టారు. అవి వాస్తవాలైతే కీలకమైన చర్చలకు అవకాశం ఇవ్వకుండా జవాబుదారీ కాకుండా రాజకీయ పెత్తనం ద్వారా తప్పించుకుందని స్పష్టమవుతుంది.దీనిపై సమగ్రంగా చర్చలు చేపట్టిన తరువాత ప్రధాని సమాధానంతో ముగింపు పలికితే రాహుల్ కానీ, విపక్షాలు కానీ నరవణె పుస్తకం లోని అంశాలుపై లేవదీసిన వాదనలు తప్పని నిరూపించడానికి ఒక సువర్ణావకాశం అయ్యేది. దీనికి భిన్నంగా మోడీ సమాధానం దాటవేయడం ద్వారా తన విమర్శకుల ఆరోపణలు నిజమేనన్న అపోహలు నిరూపించుకున్నట్టు అభిప్రాయం కలుగుతుంది. కీలకమైన ఇలాంటి అంశాలపై చర్చలు లేకుండా తప్పించుకోవడం పాలక వర్గాల్లో ప్రజాదరణ తగ్గుతుందనే భయం ఒక కారణం కాగా, పార్లమెంట్‌కు జవాబుదారీతనం లేని ధోరణిని సూచిస్తుంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదాలతో ఉభయ సభల కార్యకలాపాలకు తరచుగా అంతరాయం కలుగుతుండడం పరిపాటిగా వస్తోంది. సభలో తమను మాట్లాడనీయడం లేదని లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చేందుకు విపక్షాలు సిద్ధమయ్యాయి. రాహుల్ గాంధీని స్పీకర్ ప్రసంగించడానికి అనుమతించలేదని, కాంగ్రెస్ ఎంపీలు, మహిళా నేతలను కించపరిచేలా విమర్శించిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని అందుకే ఈ అవిశ్వాస తీర్మానం తీసుకొస్తున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలో కాంగ్రెస్ సమావేశం కూడా అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకుందని ఆయా వర్గాలు చెబుతున్నాయి.

ప్రతిపక్షం
హైదరాబాద్
శుక్రవారం
13.02.2026

మత స్వేచ్ఛ– భారత రాజ్యాంగం

ప్రార్థనలు లేదా మత సమావేశాలు వ్యక్తిగత ప్రాంగణం దాటి బహిరంగ ప్రదేశాలకు విస్తరించినప్పుడు, ప్రజా రవాణాకు ఆటంకం కలిగించే పరిస్థితి ఏర్పడినప్పుడు, లేదా శాంతి భద్రతల సమస్య తలెత్తే అనుమానం ఉన్నప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించడం లేదా అవసరమైన అనుమతులు పొందడం తప్పనిసరి. అంటే, రాజ్యాంగం హామీ ఇచ్చిన మత స్వేచ్ఛ సామాజిక శాంతి, ప్రజారోగ్యం, నైతికత వంటి పరిమితులకు లోబడి అమలవుతుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 26 కూడా ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన మత సంస్థలు స్థాపించుకోడానికి, మత సంబంధమైన కార్యకలాపాలను స్వతంత్రంగా నిర్వహించుకోడానికీ హక్కును కల్పిస్తుంది.



యండి. ఉస్మాన్ ఖాన్
9912580645

భారతదేశం సర్వమత సమభావం కలిగిన ప్రజాస్వామ్య దేశం. దీని ఆధ్యాత్మిక వికాసం కేవలం సిద్ధాంతంగా మాత్రమే కాకుండా భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల ద్వారా అమలులో ఉన్న జీవ భావనగా నిలుస్తోంది. ముఖ్యంగా ఆర్టికల్ 25 ప్రతి పౌరుడికి తన మతాన్ని విశ్వసించడానికి, ఆచరించడానికి, ప్రచారం చేయడానికి స్వేచ్ఛాధికారాలను ఇస్తుంది. అయితే ఆ స్వేచ్ఛకు పరిమితులు, ప్రయోజనాలు ఏమిటి అన్న దాని గురించి తరచుగా అపోహలు, వాద వివాదాలు సామాజిక రంగంలో కొనసాగుతుంటాయి. 2026లో వెలువడిన రెండు హైకోర్టుల తీర్పులు అలహాబాద్ హైకోర్టు, కేరళ హైకోర్టు మత హక్కుల విషయంలో స్పష్టమైన న్యాయవ్యాఖ్యానం అందించాయి. అలహాబాద్ హైకోర్టు ముందుకు వచ్చిన ప్రశ్న ఏమిటంటే, వ్యక్తిగత స్థలాల్లో, సొంత ప్రాంగణాల్లో ప్రార్థనలు లేదా మత సంబంధిత సమావేశాలు నిర్వహించడానికి పోలీసు లేదా ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా అవసరమా? ఈ ప్రశ్న Maranatha Full Gospel Ministries వర్సెస్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం (2026) కేసు రూపంలో కోర్టు ముందుకు వచ్చింది. సంబంధిత మత సంస్థలు, ట్రస్టులు తమ సొంత స్థలాల్లో, భవనాల్లో ప్రార్థనలు నిర్వహించేందుకు స్థానిక అధికారులు ముందస్తు అనుమతి తీసుకోవాలని చెప్పడం రాజ్యాంగ హక్కులకు విరుద్ధమని వాదిస్తూ హైకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన అలహాబాద్ హైకోర్టు, ప్రైవేటు స్థలాల్లో నిర్వహించే మత సంబంధమైన సభలు, ప్రార్థనలకు సాధారణంగా ముందస్తు ప్రభుత్వ లేదా పోలీసు అనుమతి అవసరం లేదని తీర్పునిచ్చింది. ఇటువంటి కార్యకలాపాలు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ద్వారా రక్షణ పొందిన ప్రాథమిక హక్కుల పరిధిలోకి వస్తాయని కోర్టు తేల్చి చెప్పింది. వ్యక్తి తన సొంత స్థలంలో, శాంతియుతంగా, ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా ప్రార్థనలు నిర్వహించుకోవడం అతని రాజ్యాంగబద్ధమైన స్వేచ్ఛ అని కోర్టు స్పష్టం చేసింది. అయితే కోర్టు ఒక ముఖ్యమైన పరిమితిని కూడా గుర్తుచేసింది. ఈ స్వేచ్ఛ పూర్తిగా నియంత్రణ లేనిది కాదు. ప్రార్థనలు లేదా మత సమావేశాలు వ్యక్తిగత ప్రాంగణం దాటి బహిరంగ ప్రదేశాలకు విస్తరించినప్పుడు, ప్రజా రవాణాకు ఆటంకం కలిగించే పరిస్థితి ఏర్పడినప్పుడు, లేదా శాంతి భద్రతల సమస్య తలెత్తే అనుమానం ఉన్నప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించడం లేదా అవసరమైన అనుమతులు పొందడం తప్పనిసరి. అంటే, రాజ్యాంగం హామీ ఇచ్చిన మత స్వేచ్ఛ సామాజిక శాంతి, ప్రజారోగ్యం, నైతికత వంటి పరిమితులకు లోబడి అమలవుతుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 26 కూడా ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన మత సంస్థలు స్థాపించుకోడానికి, మత సంబంధమైన కార్యకలాపాలను స్వతంత్రంగా నిర్వహించుకోడానికీ హక్కును కల్పిస్తుంది. మత సంస్థలు తమ ఆస్తులను కలిగిఉండడం, ప్రార్థనా విధానాలను నిర్వహించడం, తమ ఆధ్యాత్మిక కార్యకలాపాలను కొనసాగించడం వంటి అంశాలు ఈ హక్కులో భాగమే. అందుకని, తమ సొంత ప్రాంగణాల్లో ప్రార్థనలు నిర్వహించడాన్ని అడ్డుకోవడం కేవలం ఆర్టికల్ 25కే కాదు, ఆర్టికల్ 26కూ విరుద్ధమని ఈ ఆర్టికల్ ద్వారా మనకు స్పష్టమవుతోంది. ఈ తీర్పు ద్వారా కోర్టు ఒక స్పష్టమైన సూత్రాన్ని ప్రతిపాదించింది: వ్యక్తిగత విశ్వాసం, సామాజిక శాంతి మధ్య సమతుల్యత



అవసరం. రాష్ట్రం ప్రతి వ్యక్తి మత స్వేచ్ఛను గౌరవించాలి; అదే సమయంలో సమాజ శాంతి, సామరస్యాన్ని కాపాడే బాధ్యత కూడా రాష్ట్రానిదే. ప్రైవేట్ స్థలాల్లో జరిగే ప్రార్థనలను అనవసర నియంత్రణలతో అడ్డుకోవడం రాజ్యాంగ ఆత్మకు విరుద్ధమని ఈ తీర్పు వెల్లడించింది. హైకోర్టు ఇలా తీర్పునిస్తూనే ఒక ముఖ్యమైన సందేశాన్ని అందించింది: మత స్వేచ్ఛ అంటే హద్దుల అతిక్రమణ కానే కాదు, అలాగే ప్రభుత్వ నియంత్రణ అంటే హక్కుల నిరాకరణ కూడా కాదు; వ్యక్తిగత విశ్వాసం, సమాజ శాంతి మధ్య సమతుల్యతే భారత రాజ్యాంగపు ప్రధాన తత్త్వం అని స్పష్టంగా తెలియజేసింది. ఇక, రెండవది కేరళ హైకోర్టు తీర్పు. ఇది హిందూ దేవాలయాల్లోకి ఇతర మతస్తుల ప్రవేశం వంటి సున్నితమైన అంశాన్ని స్పృశించింది. అన్యమతస్థుల ఆలయ ప్రవేశానికి సంబంధించి దాఖలైన పిటిషన్‌ను కేరళ హైకోర్టు తిరస్కరించింది. అయితే అదే సమయంలో, దేవాలయాలు మతపరమైన సామరస్యానికి వేదికలుగా ఉండాలని, చట్టపరమైన నిబంధనలు మతాల మధ్య విభేదాలను పెంచేలా ఉండకూడదని కోర్టు వ్యాఖ్యానించింది. ప్రత్యేక సందర్భాల్లో, ఆలయ పరిపాలన లేదా ప్రధాన అర్చకుని అనుమతితో ఆహ్వానితులుగా వచ్చిన అన్యమతస్థులకు ప్రవేశం కల్పించడం చట్టవిరుద్ధం కాదని స్పష్టం చేసింది. 1965 నాటి కేరళ హిందూ ప్రార్థనా స్థలాల ప్రవేశ చట్టంలోని అన్యమతస్థుల ప్రవేశాన్ని పరిమితం చేసే నిబంధనలను ప్రస్తుత కాలానికి అనుగుణంగా పునఃపరిశీలించాలని ప్రభుత్వానికి సూచించింది. అధినియమం రాజ్యాంగ విలువలకు అనుగుణంగా అమలుకావాలని, సామాజిక సామరస్యాన్ని బలోపేతం చేయడమే చట్టాల ఉద్దేశ్యమని కోర్టు పేర్కొంది. అయితే, కొన్ని సందర్భాల్లో, హిందూ ధర్మంపై నమ్మకం లేనివారు, అన్యమతస్థులు ఆలయాల్లోకి రావాలనుకుంటే, డిక్లరేషన్ ఇచ్చి ప్రవేశించవచ్చని మద్రాసు హైకోర్టు వంటి ఇతర కోర్టులు అభిప్రాయపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. కాని, కేరళ హైకోర్టు ఈ తీర్పు ద్వారా, భక్తి, నమ్మకాల విషయంలో మతపరమైన ఆంక్షల కంటే మానవీయ కోణానికి, సామాజిక సామరస్యానికి ప్రాధాన్యతనిచ్చింది. ఈ రెండు తీర్పులను నిశితంగా పరిశీలిస్తే ఒక అంశం స్పష్టంగా మన ముందుకొస్తుంది. భారత న్యాయవ్యవస్థ మత స్వేచ్ఛను గౌరవిస్తూనే, దానికి రక్షణ కల్పిస్తూనే, అదే సమయంలో అది సామాజిక శాంతి, సమతౌల్యం, పరస్పర గౌరవానికి భంగకరంగా మారకుండా ఉండేలా జాగ్రత్తలు కూడా చెప్పింది. ప్రైవేట్ స్థలాల్లో వ్యక్తిగత ప్రార్థనలకు పూర్తిగా హక్కును ధృవీకరిస్తూ, సమాజంలో సున్నితంగా మారే పరిణామాల విషయంలో చట్టం, సంప్రదాయం, సామాజిక విలువల మధ్య సమతుల్యత ఉండాలని నొక్కి వక్కాణించింది. ఈ తీర్పుల ద్వారా ప్రజలు స్పష్టంగా అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, భారత రాజ్యాంగం మతానికి ఎంతమాత్రం వ్యతిరేకం కాదు, అలాగే మతం పేరుతో అనవసర నియంత్రణలకూ అనుమతించలేదు. వ్యక్తిగత విశ్వాసం స్వేచ్ఛగా ఉండాలి, అదే సమయంలో సమాజం శాంతీ సామరస్యాలతో, సమైక్యతతో వర్ధిల్లాలి. ఈ రెండు లక్ష్యాల మధ్య సమతుల్యతే భారత రాజ్యాంగపు నిజమైన ఆత్మ.

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్టు)

పరభాష పోరుకై 'పరాశక్తి'



పట్ట హరిప్రసాద్
8790 84 3009

ప్రస్తుత కాలంలో వస్తున్న సైన్మాలు ఎట్లున్నాయో కొత్తగా చెప్పనవసరం లేదు. పక్కా కమర్షియల్ అనడంలో ఏమాత్రం సందేహం లేదు.. చివరికి పక్కా కమర్షియల్ పేరుతోనూ కమర్షియల్ సినిమా వచ్చింది. ఈ తరంలో సమాజం ఒకటి ఉందని గుర్తించే సినిమా కావాలంటే అరుదే అనుకోవాలి. పెద్ద పెద్ద నటులు సైతం సందేశాత్మక చిత్రాలకు దూరం అవడమూ బాధాకరమైన విషయమే. అయితే ప్రకృతి పాజిటివ్ వైపరిత్యమేమో తెలియదు కానీ పాత ఉద్యమాల జ్ఞాపకాలను రివైజ్ చేసి సినిమాలు వస్తున్నాయంటే మంచి విషయమే. దేశ ప్రజలకు తెలిసిన విషయం... ప్రస్తుత జనరేషన్ లోనూ కొనసాగుతున్న వివాదంపై సైన్మా తీయడం శుభపరిణామమే. హిందీభాషను బలవంతంగా రుద్దడం అంశంపై ఇప్పటికే చాలా రాష్ట్రాలు పోరాటాలు చేశాయి.. అందులో ముఖ్యంగా ముందున్న పోరాటం తమిళనాట హిందీభాష వివాదం.

భాష అంటే శబ్దమో, అక్షరాలు కాదు.. అది జాతి సంస్కృతి, గుర్తింపు, భాషకోసం వందలాది మంది ప్రాణాలు అర్పించారు. అందులో తమిళనాడులో భాషా యుద్ధ వీరుడు రాజేంద్రన్.. ఇప్పటికీ తమిళనాడులోనే కాదు, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక లాంటి హిందీ మాట్లాడని రాష్ట్రాల్లోనూ ఆయన విగ్రహాలు ఉన్నాయి. అయితే ప్రత్యేక్షంగా జరిగిన పోరాటాన్ని పరాశక్తి అనే పేరుతో సినిమా రూపంలో సమాజానికి చూపించే ప్రయత్నం జరిగింది. అన్ని భాషల్లోనూ డబ్బింగ్ జరిగింది. శివకార్తికేయన్ హీరోగా, శ్రీలీల కథానాయకగా, సుధా కొంగర డైరెక్షన్ చేశారు. హిందీని అధికార భాష చేయాలన్న నిర్ణయానికి దక్షిణాదిలో ముఖ్యంగా తమిళనాడులో జరిగిన ఉద్యమం ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమా పరాశక్తి (పరభాషపై శక్తివంతంగా పోరాటం చేయాలనే అంశం)

ప్రత్యేక్ష కథాంశం: ప్రధానిగా జవహర్ లాల్ నెహ్రూ కొనసాగుతున్న రోజుల్లో రైల్వే ఉద్యోగ ప్రకటనను ప్రాంతీయ భాషా పత్రికల్లో ఇవ్వకుండా హిందీ ప్రతికల్లో మాత్రమే ఇవ్వడంతో దక్షిణాదిలో కొంత ఆవేశాగ్రహాలు వెల్లువెత్తాయి. చెల్లయన్(శివకార్తికేయన్ పాత్ర) ఆధ్వర్యంలో పురాణాపూర్ గ్యాంగ్ ఓ రైలుకు నిప్పంటించి దగ్ధం చేస్తుంది. అలా కట్ చేస్తే... కొన్ని రోజులకు రైల్వే ఇంజన్‌లో బొగ్గు వేసే ఉద్యోగంలో శివకార్తికేయన్(చెల్లయన్) చేరతాడు. అలా కొనసాగుతూ ఉండగా ప్రధాని ఇందిరాగాంధీ టైమ్‌లోమళ్లీ హిందీ ఉద్యమం రిపీట్ అవుతుంది. ఆ ఉద్యమంలో కాలేజీలో చదువుతున్న శివకార్తికేయన్ తమ్ముడు చిన్నదురై (నటుడు అథర్వ మురళీ) ఉద్యమంలో చురుగ్గా ఉంటాడు. దాన్ని తెలుసుకొని అడ్డు పడతాడు శివకార్తికేయన్. ముందు జరిగిన ఉద్యమంలో ఎన్నో ఇబ్బందుల్లో చిక్కుకుంటాడు శివకార్తికేయన్, ఉద్యమానికి ప్రణాళిక, మద్దతు, కుటుంబ వ్యవహార విషయాలను బేరీజు వేసుకొని బలమైన ఉద్యమం కోసం ఎదురుచూస్తుంటాడు కార్తికేయన్.. అందుకే ఆవేశం, ఉద్రేగపూరితమైన ఉద్యమాలతో ప్రాణాలు నష్టపోవడమే కాక ఫలితం రాదు అని తమ్ముడు (చిన్నదురై) చేస్తున్న ఉద్యమానికి అడ్డుగా శివకార్తికేయన్ (చెల్లయన్) ఉంటాడు.

విశ్లేషణాత్మక వివరణ:

వాస్తవ ఘటనల నేపథ్యంలో తెరకెక్కిన సినిమా. హిందీని అధికార భాష చేయడం పట్ల జరిగిన ఉద్యమాల్లో కొందరు ప్రాణాలు కోల్పోయారు. ఆ వీరుల త్యాగాన్ని తక్కువ చేయలేం కాదూ..? తమిళనాడులో జరిగిన ఉద్యమాన్ని కథగా తీసుకున్నారు డైరెక్టర్ సుధా కొంగర. కథకు తెలుగు, కన్నడ, మలయాళ ప్రజలతో పాటు ఉత్తరాది నుంచి మద్దతు లభించింది. ఉద్యమం ఎక్కడ మొదలైంది అనేది కాదు.. ఇప్పుడు దక్షిణాది ఐక్యమత్యంమే మహాబలం అనే సందేశాత్మకం ఎంతో విలువైంది... కన్నడ (కర్ణాటక), మహారాష్ట్ర (మరాఠీ), వెస్ట్ బెంగాల్ (బెంగాలీ)లోనూ ఈ ఏడాది భాషపై ఎన్నో ఉద్యమాలు జరిగాయి. ప్రస్తుతానికి మాతృ భాషను విడిచి పరాయి భాష (హిందీ) రుద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రత్యేక్ష సంఘటనలపై తీసిన సినిమాలో ఉద్యమాన్ని మరింత రగిలించే సన్నివేశాలుంటే ఇంకా బాగుండేదేమో.

వాస్తవ రూపం:

హిందీభాష వివాదంపై తీసిన పరాశక్తి సినిమాపై వివాదమూ కనిపించింది. అదేంటంటే హిందీభాషపై పోరాటం విషయంలో తెలుగువాళ్లను అవమానించేలా డైలాగులు ఉన్నాయని మండిపాటు... నిజానికి తెలుగు వాళ్లు వేరే ప్రాంతానికి వెళ్తే ఏ రకమైన గౌరవం ఉండేదో తెలిసిన విషయమే. తెలుగువారంటే చిన్నచూపు.. నిజానికి హిందీ వ్యతిరేక ఉద్యమం 1960లో తమిళనాడుతో జరిగింది. ఆ టైమ్ లోనూ హిందువులకు దగ్గరగా ఉండేలా గోల్టీ అనే పదాన్ని వాడింద్రు... గోల్టీ అంటే చోరీ (దొంగ) అని ప్రాచుర్యం మాత్రమే.. కానీ తమిళభాషలో తెలుగును రివర్స్ గా పిలుస్తారు. తెలుగుగులుతె.. ఇది భాషవిధాన పర్యం... అది కాస్త గుల్టీగా మారింది. మనం ఇంగ్లీషును తెలుగులోకి తర్జుమా చేస్తే ఎట్లా నిర్మిస్తమో... తెలుగును తమిళంలోకి తర్జుమా చేస్తే అదే విధానం.. కానీ ఈ పదం కొత్తగా దొంగ అంటూ ప్రాచుర్యంలోకి రావడంతో తెలుగువాళ్లు కొంత ఆగ్రహానికి గురైయ్యారు... దీన్ని అవకాశంగా తీసుకున్న సెంట్రల్ సెన్సార్ బోర్డు కావాలనే అభ్యంతరం తెలిపి ఆధారిత అంశాలను కట్ చేయమని సూచించింది. గుల్టీ అనే పదం సినిమాకు మెయిన్ పాయింట్.. అంటే తెలుగువాళ్లు (ఆంధ్రోళ్లు) అని తెలపడం... దాన్నే తొలగిస్తే సినిమాలో ఫ్లో పోతుంది. ఇదే కాకుండా కేంద్రానికి వ్యతిరేకంగా ఉన్న మరో 25కు పైగా సన్నివేశాలను కట్ చేయమని ఆదేశాలు జారీ చేసింది.

మనస్సును కదిలించే భావం:

సోషల్ మీడియాలో పరాశక్తిని తెలుగువాళ్లు బాయ్ కట్ చేయాలంటూ విమర్శలు చేస్తున్నారు. ఇది సరైనది కాదు... ఏదైనా ఒక అంశాన్ని కట్టినట్లు చూపించాలంటే ఎంతోకొంత క్రియేటివిటీ చేయాలి.. కానీ ప్రత్యేక్షంగా జరిగిన విషయం.. కొత్త తరానికి ఇది స్ఫూర్తిగా ఉండాలనే తీసిన చిత్రం మాత్రమే. ఇందులో కొన్ని సన్నివేశాలు ఉద్యమ కాలంలో జరిగిన సంఘటనలే.. మిగతా భాషారాష్ట్రాలు ఇలానే చేయాలని కాదు... తమిళనాడులో ఉద్యమం మొదలైనప్పుడు పరిస్థితి వేరు.. ఇప్పుడు పరిస్థితి వేరు... అర్థవంతమైన విమర్శలు పరిష్కార మార్గాలను చూపుతాయి.. తమిళ రూపంలో వచ్చిన ఐక్యత చిత్రానికి తెలుగురాష్ట్రాల నుంచి మద్దతు ఉంది.. తెలంగాణ నుంచి స్పష్టమైన మద్దతు ఉంది. కానీ ఆంధ్ర ప్రభుత్వం నుంచే కొంత వెనుకంజ కనిపించింది. తమిళనాడుకు తెలంగాణ కంటే ఆంధ్రా బంధమే దగ్గర అని చెప్పాలి. తమిళనాడు, ఆంధ్రకు ఎప్పటి నుంచో విడదీయరాని సంబంధాలు ఉన్నాయి. ఇప్పటికీ ఆంధ్రాలో కొన్ని జిల్లాల్లో తమిళ సాంప్రదాయాలు కొనసాగిస్తుంటాం.. అలాంటిది ఆంధ్ర ప్రభుత్వం పరాశక్తిలాంటి సినిమాను ప్రోత్సాహించకపోయినా పర్వాలేదు కానీ విమర్శలను అడ్డుకోకపోవడం బాధాకరం. కేంద్ర కూటమిలో ఉండి అధికారాన్ని కొనసాగించేందుకు మౌనం పాటిస్తే తల్లిలాంటి మాతృభాషకు ప్రభుత్వమే తూట్లూ పొడిచినట్లవుతుంది. హిందీకి కొత్త బంధుత్వంలో ఉన్న కూటమి ప్రభుత్వం నుంచి హిందీ వ్యతిరేక ఉద్యమానికి పోత్సాహాన్ని ఆశించిడం అందని ద్రాక్షేలానే కనిపిస్తోంది. ఇప్పటికైనా వాస్తవ ఉద్యమాన్ని విస్తృతం చేసుకోకపోతే తల్లిపాలు లాంటి జాతి జాగృతిని విడిచి దబ్బాపాలు లాంటి మోసపూరితమైన సమాజంలోకి నెట్టవేయబడతాం.

ఏజెన్సీ డీఎస్సీ ఎప్పుడు వేస్తారు!

తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అంటూ వేదిక ఏదైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే గుర్తు చేస్తుంటారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలు అంటే ఆదివాసులు నివసించే అటవీ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి అత్యంత ప్రాముఖ్యమైనది. ఈ ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. అందువల్ల ప్రభుత్వం తక్షణమే ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాల్సిన అవసరం ఉంది. తెలంగాణ స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాత 2018 సంవత్సరంలో ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ తర్వాత 2024 మెగా డీఎస్సీ పేరుతో టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. మొత్తం ఉపాధ్యాయ ఖాళీల సంఖ్య 11,062 ఉండగా దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 2,79,



లేఖ

956 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఒక్క పోస్ట్‌కు 26 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. 6 సెప్టెంబరు 2023 నాటికి ఏజెన్సీ ప్రాంతంలో 5089 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ ని పక్కన పెట్టిన పాలకులు 22 ఏప్రిల్ 2020 సంవత్సరం సుప్రీంకోర్టులో జీవో నెంబర్ 3 ను కొట్టి వేయబడిందని సాకు చెబుతూ అర్హులైన స్థానిక ఆదివాసీ నిరుద్యోగ యువతకు దక్కవలసిన ఉపాధ్యాయ ఉద్యోగాలు గిరిజనేతర్లతో భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో భర్తీ చేయవలసిన 5,089 ఉపాధ్యాయ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. అర్హత కలిగిన స్థానిక ఆదివాసి నిరుద్యోగ యువత ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తుంది.

ఉపాధ్యాయుల కొరత – ప్రధాన సమస్య

ఏజెన్సీ ప్రాంతంలోని ప్రైమరీ పాఠశాలలు ట్రైబల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్కూల్స్ సంఖ్య 2,311 ఉండగా ట్రైబల్ రెసిడెన్షియల్, ఆర్ఎస్,ఆర్ జె సి, జీఎం స్కూల్స్ మొత్తం 165 ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో అనేక పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో నడుస్తున్నాయి. కొన్నిచోట్ల ఒకే ఉపాధ్యాయుడు అన్ని తరగతులకు బోధిస్తున్న పరిస్థితి ఉంది. ఇది విద్యా ప్రమాణాలను తగ్గిస్తోంది. విద్యార్థులు సరైన మార్గదర్శకత్వం పొందలేక పోతున్నారు. ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ ద్వారా అర్హత కలిగిన స్థానిక ఆదివాసి అభ్యర్థులను నియమిస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

ఆదివాసి విద్యార్థుల అభివృద్ధి

ఆదివాసి ప్రాంతాల్లో విద్యార్థులు భాషా సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, రవాణా సౌకర్యాల లోపం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. స్థానిక భాష, సంస్కృతి తెలిసిన ఉపాధ్యాయులు ఉంటే విద్యార్థులకు బోధన సులభంగా అర్థమవుతుంది. దీంతో చదువు మానివేతలు తగ్గి, ఉన్నత విద్యకు అవకాశాలు పెరుగుతాయి. బీఈడీ, టిటిసి పూర్తిచేసిన స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఆదివాసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఇది వారి ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే కాకుండా, ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతుంది. స్థానికులు ఉద్యోగాలు పొందితే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వేగవంతమవుతుంది.

ప్రభుత్వ బాధ్యత

రాష్ట్రప్రభుత్వం గిరిజన సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకోవాలి. రాజ్యాంగం కూడా ఆదివాసి ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక రక్షణ కల్పించింది. అందువల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను గుర్తించి, ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలి ఆదివాసి నిరుద్యోగ యువత కోరుతున్నారు. మన పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఆదివాసి ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం సుప్రీంకోర్టు కొట్టి వేసిన జీవో నెంబర్ 3 ను పునరుద్ధరించి ఏజెన్సీ ప్రాంతాలలోని ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి ప్రత్యేక ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ జారీ చేసి నిరుద్యోగ ఆదివాసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. మొత్తానికి ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ అత్యవసరం. ఇది ఆదివాసి విద్యార్థుల భవిష్యత్తును ప్రకాశవంతం చేయడమే కాకుండా, ఆదివాసి సమాజ అభివృద్ధికి బాటలు వేస్తుంది. ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం తక్షణ చర్యలు తీసుకుని ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అర్హులైన ఆదివాసి నిరుద్యోగ యువత ఆశిస్తున్నారు.

డాక్టర్ సాగబోయిన పాపారావు
ఆదివాసీ విద్యార్థి సంఘం
రాష్ట్ర కార్యనిర్వహక
అధ్యక్షులు, 9989828774



రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008



ఉద్యమ సోయి లేని వ్యక్తి సీఎం కావడం మన దౌర్భాగ్యం. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కోదండరాం, ఆకునూరి మురళి వంటి నేతలు మద్దతు ఇవ్వడంతో ప్రజలు నమ్మారు. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై వారు ఎందుకు మౌనం వహిస్తున్నారో ప్రజలకు చెప్పాలి. బడ్జెట్ సమావేశాల్లోనే ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ, సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం ప్రావిజన్ పెట్టాలి.



త్వరలోనే రాజకీయ పార్టీ ప్రకటిస్తా

తెలంగాణ అస్తిత్వం కోసం కొత్త వేదిక.. ఉద్యమకారుల కోసం మరో ఉద్యమం

మొదటిపేజీ తరువాయి

ప్రతినిధులు, విద్యార్థి నేతలు హాజరైన ఈ సభలో కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాలంటే మరో ఉద్యమమే మార్గమని, త్వరలోనే తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే కొత్త రాజకీయ పార్టీని ప్రకటించబోతున్నామని కవిత స్పష్టం చేశారు. ఫిబ్రవరి 12న చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఆర్టీసీ కళ్యాణ మండపంలో మళ్లీ సమావేశమవడం కొంత సిగ్గుగా, కొంత సంతోషంగా ఉందన్నారు. సమైక్యవాద శక్తులు ఒక్కటైన వేళ ఇదే వేదికపై తెలంగాణ జేఏసీగా ఏర్పడి ఉద్యమాన్ని నడిపామని, ఆ తర్వాత రాష్ట్రాన్ని సాధించుకున్నామని గుర్తు చేశారు. అయితే రాష్ట్రం వచ్చిన తర్వాత ఉద్యమకారులకు గౌరవం, ఆర్థిక భద్రత, రాజకీయ అవకాశాలు లభిస్తాయని భావించినా ఆ ఆశలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. "మీరు బయట ఉండి బాధపడితే నేను బీఆర్ఎస్‌లో ఉండి బాధపడ్డాను. జీ హుజూర్ అంటే అక్కడే ఉండేదాన్ని.. క్యా హుజూర్ అన్నందుకు ఇక్కడ ఉన్నా" అంటూ పార్టీ అంతర్గత పరిస్థితులను సూచించారు. కేసీఆర్‌ను వ్యక్తిగతంగా విమర్శించే ఉద్దేశం లేదని చెప్పినా, పదేళ్లు అవకాశం దక్కినా ఉద్యమకారులకు ఎందుకు న్యాయం జరగలేదని ప్రశ్నించారు. అహంకారం, సహనశీలత లేకపోవడమే బీఆర్ఎస్ అధికారం కోల్పోవడానికి కారణమని వ్యాఖ్యానించారు.

తెలంగాణ వచ్చిన తర్వాత కూడా చేదు జ్ఞాపకాలు అలాగే ఉండిపోవడం, మనవాళ్లే అవమానించడం మరింత బాధ కలిగించింది. ఉద్యమకారులపై లాఠీ ఎత్తాలంటే ముందు నాపై పడాల్సిందే.. బుల్లెట్ తగలాలంటే ముందుగా నన్ను దాటి వెళ్లాలి

-కవిత భావోద్వేగం



ఉద్యమ సోయి లేని వ్యక్తి సీఎం కావడం..

ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కవిత తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఉద్యమ సోయి లేని వ్యక్తి సీఎం కావడం మన దౌర్భాగ్యమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కోదండరాం, ఆకునూరి మురళి వంటి నేతలు మద్దతు ఇవ్వడంతో ప్రజలు నమ్మారని, ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై వారు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. బడ్జెట్ సమావేశాల్లోనే ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ, సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం ప్రావిజన్ పెట్టాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే ప్రజలు సీఎంను బిల్డింగ్ బయటకు గుంజుతారని హెచ్చరించారు. తెలంగాణ చరిత్రను ప్రస్తావిస్తూ గోండు వీరులు రామ్‌జీ, కొమురం భీమ్ నుంచి దొడ్డి కొమురయ్య వరకు సాగిన పోరాట గాథను వివరించారు. 1969 ఉద్యమంలో అమరులైన 369 మంది విద్యార్థులను స్మరించారు. జయశంకర్ సార్ విగ్రహం ఏర్పాటు చేయలేకపోయిన బాధను వ్యక్తం చేశారు. గద్దర్, బిరుదురాజు రామరాజు, సుద్దాల హన్మంతు వంటి తెలంగాణ స్ఫూర్తి ప్రతీకలకు తగిన గౌరవం దక్కలేదన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా చేదు జ్ఞాపకాలు అలాగే ఉండిపోవడం, మనవాళ్లే అవమానించడం మరింత బాధ కలిగించిందన్నారు. ఉద్యమకారులపై లాఠీ ఎత్తాలంటే ముందు తనపై పడాల్సిందేనని, బుల్లెట్ తగలాలంటే ముందుగా తనను దాటి వెళ్లాలని కవిత భావోద్వేగంగా అన్నారు. ఉద్యమకారుల పిల్లలకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో అవకాశాలు రావడం లేదని, హైదరాబాద్‌లో ఉన్న కార్పొరేట్ సంస్థల్లో తెలంగాణ బిడ్డలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. చిన్న కాంట్రాక్టర్లు నష్టపోతుండగా కొంతమంది మాత్రమే అపార సంపద కూడబెట్టారని ఆరోపించారు. ఉద్యమకారుల గుర్తింపునకు తెలంగాణ జాగృతి ప్రత్యేక యాప్‌ను సిద్ధం చేసిందని ప్రకటించారు. అందులో నమోదు చేసుకున్న ప్రతి ఉద్యమకారుడి కుటుంబానికి జాగృతి తరఫున హెల్త్ ఇన్సూరెన్స్ కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వం గుర్తించకపోతే ప్రశ్నించడమే కాకుండా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఉద్యమంలో కేసులు ఉన్నవారే ఉద్యమకారులన్న నిర్వచనాన్ని తిప్పికొడుతూ, కేసులు లేకుండానే పోరాడిన వారు ఎంతోమందున్నారని చెప్పారు. త్వరలో ప్రకటించబోయే పార్టీ ఫక్తు రాజకీయ పార్టీ కాదని, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే రాజకీయ వేదిక అవుతుందని స్పష్టం చేశారు. ఉద్యమకారుల అజెండానే పార్టీ మార్గదర్శకమని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు కాలరాయబడ్డాయని, సోషల్ మీడియాలో అభిప్రాయం వ్యక్తం చేసినా అరెస్టులు జరిగాయని ఆరోపించారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం వంటి నిర్ణయాలు ఉద్యమ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.

చాకలి ఐలమ్మ, మారోజు వీరన్న వంటి పోరాట యోధుల స్ఫూర్తితో ముందుకు సాగుతామని, అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారుల పక్షానే ధర్మం ఉందని, వారి కోసం తెలంగాణ జాగృతి పోరాటం కొనసాగిస్తుందని కవిత ప్రకటించారు. సభలో పాల్గొన్న ఉద్యమ సంఘాల ప్రతినిధులు కూడా కవిత నిర్ణయాలకు మద్దతు ప్రకటించగా, ఫిబ్రవరి 12ను ఉద్యమకారుల ఆత్మగౌరవ దినంగా గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉద్యమ కారుల సంఘం నాయకులు, జాగృతి నేతలు రూప్ సింగ్ , నవీన్ చారి , ఇస్మాయిల్ , లోక రవిచంద్ర, భవానీ వేముల, నరేష్, లలిత యాదవ్, శ్రావణి, మనోజ, మరియా, పాల్గొన్నారు పాల్గొన్నారు.











త్యాగాలకు గౌరవం కావాలి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్ ఫిబ్రవరి 12: తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో పలువురు ఉద్యమ నేతలు, మహిళా ప్రతినిధులు, విద్యార్థి నాయకులు, జర్నలిస్టులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రాష్ట్రం కోసం త్యాగాలు చేసిన ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు ప్రస్తుతం ఆర్థికంగా దుర్భర పరిస్థితుల్లో ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన వారిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. అమరవీరుల ఆశయాల సాధన సమితి ప్రతినిధి సాయిరాం మాట్లాడుతూ, తెలంగాణలో అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులు, కళాకారులను గాలికి వదిలేశారని అన్నారు. కొంతమంది ఉద్యమకారులకు కోటి రూపాయలు ఇచ్చామని చెప్పుకుంటున్నా, దగాపడ్డ వారికి కనీసం పది లక్షలైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ముఖ్యమంత్రి అసభ్య భాషను మానుకోవాలని కోరారు. కవిత తీసుకున్న బాధ్యతకు మద్దతు తెలుపుతూ అందరికీ న్యాయం జరిగేలా ఆమె అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ప్రతినిధి బత్తుల సోమయ్య మాట్లాడుతూ, త్యాగాలతో సాధించిన తెలంగాణలో ఇప్పటికీ హక్కుల కోసం పోరాటం చేయాల్సి వస్తోందని అన్నారు. అమరవీరుల తల్లిదండ్రులు ఆకలితో ఉన్నా, అధికార వర్గాలు రాజభోగాలు అనుభవిస్తున్నాయని విమర్శించారు. ఉద్యమంలో కీలకంగా ఉన్నవారిని పక్కన పెట్టారని, కేసీఆర్ చుట్టూ ఉన్నవారు త్యాగాలు చేసిన వారికి న్యాయం చేయాల్సిన బాధ్యతను నిర్వర్తించలేదని పేర్కొన్నారు. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ కవితకు మద్దతు ప్రకటించారు. జానకి రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ వచ్చిన తర్వాత ఉద్యమకారుల కష్టాలు తగ్గలేదని, పిల్లలకు ఉద్యోగాలు రావడం లేదని అన్నారు. ఉద్యమంలో కష్టపడని వారు కవితపై విమర్శలు చేయడం

- ఉద్యమకారుల హక్కుల కోసం మళ్లీ పోరాటం
- అమరుల కుటుంబాలకు న్యాయం చేయాలి
- కవితకు మద్దతుగా ఉద్యమకారుల తీర్మానం

తగదని హెచ్చరించారు. మహిళలంతా కవితకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్‌కు చెందిన కుమార స్వామి మాట్లాడుతూ, ఉద్యమకారుల సమస్యలపై రాజకీయ పార్టీలు స్పందించడం లేదని అన్నారు. భూపోరాటం ద్వారా కవిత ఉద్యమకారులకు అండగా నిలిచారని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు పోరాడాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కవిత నాయకత్వం అవసరమని అభిప్రాయపడ్డారు. సుధం లక్ష్మి మాట్లాడుతూ, ఉద్యమంలో అనేక కేసులు ఎదుర్కొన్నామని గుర్తుచేశారు. కవిత ఇచ్చే ఏ పిలుపుకైనా తమ మద్దతు ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో ఆమె సీఎం అవుతారన్న నమ్మకం వ్యక్తం చేశారు. ఉద్యమకారుల జేఏసీ ప్రతినిధి బోగె పద్మ మాట్లాడుతూ, మహిళలు తెలంగాణ ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేశారని, అందులో కవిత ముందుండి నడిపించారని అన్నారు. భూపోరాటాన్ని 33 జిల్లాలకు విస్తరించాలని కోరారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడబోమని స్పష్టం చేశారు. సాజిద్ సికిందర్ మాట్లాడుతూ, తనపై 150 కేసులు నమోదయ్యాయని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అందరికీ గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కవితను సీఎం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి మాట్లాడుతూ, ఉద్యమంలో ముందుండి పోరాడిన వారు ఆర్థికంగా చితికిపోయారని అన్నారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసినప్పటికీ ఉద్యమకారులకు తగిన గౌరవం దక్కలేదని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయడానికి కవిత ముందుకు వచ్చారని తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి చెందిన చైతన్య మాట్లాడుతూ, నిఖార్సైన ఉద్యమకారుల జాబితాను సిద్ధం చేసి కవితకు అందిస్తామని తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఉద్యమకారులకు అన్యాయం చేశాయని ఆరోపించారు. సిద్ధారెడ్డి మాట్లాడుతూ, ఉద్యమకారులకు 250 గజాల స్థలం వంటి హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమరవీరుల కుటుంబాలకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని, సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని కోరారు. జర్నలిస్ట్ చిలుక ప్రవీణ్ మాట్లాడుతూ, ఉద్యమకారుల కోసం కవిత చేపట్టిన కార్యక్రమం ధైర్యవంతమైన అడుగని అభిప్రాయపడ్డారు. ఆమె తీసుకునే నిర్ణయాన్ని బట్టి మద్దతు ఇవ్వాలని సూచించారు. గీతా గుప్తా మాట్లాడుతూ, కవితకు జరిగిన అన్యాయం తర్వాత కూడా ఆమె ఉద్యమకారుల కోసం ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఆమె సీఎం కావాలని ఆకాంక్షించారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి ప్రతినిధి రంజిత్ కుమార్ మాట్లాడుతూ, ఉద్యమ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ న్యాయం జరగలేదని విమర్శించారు. బీసీలు, ఎస్సీలు, మహిళలు, ఉద్యమకారుల కోసం కవిత పోరాటం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ జాగృతి వైపు అన్ని వర్గాలు ఆశగా చూస్తున్నాయని తెలిపారు. సభలో పాల్గొన్నవారందరూ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అమరవీరుల కుటుంబాలకు న్యాయం, ఉద్యమకారులకు గౌరవం, గుర్తింపు, ఆర్థిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కవిత నాయకత్వంలో ఉద్యమకారుల హక్కుల సాధనకు ముందుకు సాగుదామని సంకల్పం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 12 తెలంగాణ చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.








ప్రజాస్వామ్య విలువలను కాలరాయడం వల్లే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని కవిత అన్నారు. ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చనందుకే కేసీఆర్ అధికారానికి దూరమయ్యారు. రేవంత్ పట్టించుకోకపోతే ఆయననూ ప్రజలు వదిలిపెట్టరు. రాజకీయ పార్టీ పెడతానంటే తనపై దాడులు చేస్తున్నారు. ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడానికి తెలంగాణ పదం ఉండేలా పార్టీ పెడతా.

- ఆత్మగౌరవ సభలో కవిత

ప్రాంతీయం



ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి
- కౌంటింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల సందర్శన

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 12 : నిజామాబాద్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో రిటర్నింగ్ అధికారులకు, కౌంటింగ్ సూపర్వైజర్లు, సహాయ సూపర్వైజర్లకు శుక్రవారం ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను కలెక్టర్ సందర్శించి, ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించాల్సిన విధానం గురించి కీలక సూచనలు చేశారు. అదేవిధంగా బోధన్ లోని విజయ మేరీ హైస్కూల్ లో కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను, కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూమ్ లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను సైతం కలెక్టర్ సందర్శించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ భావోద్వేగాలతో ముడిపడి ఉన్నందున ఎంతో జాగ్రత్తతో బాధ్యతాయుతంగా కౌంటింగ్ విధులు నిర్వహించాలని కలెక్టర్ హితవు పలికారు. కౌంటింగ్ హాలు లోనికి ఆర్.ఓ మినహా ఇతరులు ఎవరికీ సెల్ ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. సమయ పాలన పాటిస్తూ కౌంటింగ్ విధులకు సకాలంలో చేరుకోవాలని ఆదేశించారు. కాగా, నిజామాబాద్ నగర పాలక సంస్థకు సంబంధించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, బోధన్ మున్సిపాలిటీ ఓట్లను బోధన్ పట్టణంలోని విజయ మేరీ హైస్కూల్ లో, ఆర్మూర్ మున్సిపల్ ఓట్లను ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, భీంగల్ మున్సిపాలిటీకి సంబంధించిన కౌంటింగ్ ను భీంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. శుక్రవారం ఉదయం స్ట్రాంగ్ రూమ్ ల నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాళ్లకు చేరుస్తూ, 8.00 గంటల నుండి అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అవుతుందని వెల్లడించారు. నిర్ణీత సమయానికి కౌంటింగ్ ప్రారంభించేందుకు వీలుగా సిబ్బందిని అన్నివిధాలుగా సన్నద్ధం చేశామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఇప్పటికే పలు విడతలుగా శిక్షణ తరగతులు నిర్వహించి పూర్తి అవగాహన కల్పించామని అన్నారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద డివిజన్/వార్డు వివరాలను తెలిపేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశామని, ఎలాంటి పొరపాట్లు, గందరగోళానికి తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వివరించారు. కాగా, అభ్యర్థులు, వారి తరఫున ఏజెంట్లు వారికి సూచించబడిన సమయం ఉదయం 7.00 గంటల లోపు కౌంటింగ్ సెంటర్ల వద్దకు రావాలని కలెక్టర్ సూచించారు. తాము జారీ చేసిన ఎంట్రీ పాసులతో పాటు ఏదైనా గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన పోలీస్ బందోబస్తు ఉంటుందని అన్నారు అన్నారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తదితరులు ఉన్నారు.



ఘనంగా రూరల్ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 12 : నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్యకర్తలు ఆలయాలలో ప్రత్యేక పూజలు, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని డిచ్ పల్లి మండల కేంద్రం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేసి రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూలసని శ్రీనివాస్, మండల అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు మెట్టు సాంసన్, ధర్మ గౌడ్, డాక్టర్ షాదుల్లా, మాజీ ఎంపీపీ చిన్నోళ్ల నరసయ్య, డిచ్పల్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు గొట్టిపాటి వాసు. సర్పంచులు కోట్ల భాస్కర్, ఖర్జూరం కిరణ్, ఎడ్ల ప్రవళిక వినోద్, తేనేటి హేమలత లక్ష్మణ్, సుదం శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఖాదర్ బాబా, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఈ లోకాన్ని చల్లగా చూడు శివయ్య

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య
- రామలింగేశ్వరున్ని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు
- శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవం
- శివయ్యకు అభిషేకం చేసిన ఎమ్మెల్యే శంకర్, అనురాధ దంపతులు

ప్రతిపక్షం, షాద్‌నగర్, ఫిబ్రవరి 12: తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత మహిమానిత్వమైన, స్వయంభూ లింగం శ్రీ ఉత్తర రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, ఆయన సతీమణి అనురాధ దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. బుధవారం రామేశ్వరంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఆలయ నిర్వహణ అధికారి శివ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శంకర్ దంపతులతో స్వామి వారికి అభిషేకం చేయించారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట లింగారెడ్డిగూడెం ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ దంపతులు, కృష్ణ దంపతులు, నవీన్ దంపతులు, బుడ్డ నరసింహ దంపతులు, మంకాళి శ్రీశైలం దంపతులు, అలాగే కాంగ్రెస్ నేతలు అగ్గనూరు బస్వం, చల్లా శ్రీకాంత్ రెడ్డి, బాలరాజ్ గౌడ్, తుపాకుల శేఖర్, రాయికల్ శ్రీనివాస్, భార్గవ కుమార్ రెడ్డి, సంపత్ కుమార్, పినమోని శ్రీనివాస్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. లోకాన్ని చల్లగా చూసే స్వామి ముక్కంటి శివయ్య అని ఆయన ఆశీసులు భక్తులపై ఎల్లవేళలా ప్రసరిస్తాయని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఆయన కరుణా కటాక్షాలతో ప్రభుత్వం ప్రజలను చల్లగా పాలిస్తుందని అన్నారు. శివరాత్రి మహాదిన పర్వాన బ్రహ్మోత్సవాలు ప్రభుత్వ అత్యంత వైభవంగా నిర్వహిస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అనురాధ దంపతులకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి ఆయనను సన్మానించారు. ఫరూక్ నగర్ మండలం రామేశ్వరంలో ఈనెల 11వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయని ఆలయ కార్య నిర్వహణ అధికారి శివకుమార్ తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు కొనసాగే ఈ బ్రహ్మోత్సవాలకు సంబంధించి మొదటి రోజు గణపతి పూజ, రుద్ర హోమం, ధ్వజారోహణం ప్రతిష్ట తదితర కార్యక్రమాలు ఉంటాయి. 12న శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. 13న నంది సేవ, అగ్ని గుండాలు తదితర కార్యక్రమాలు ఉంటాయి. 14న రుద్రాభిషేకం, విశేష అలంకరణ నిర్వహిస్తారు. 15న మహాశివరాత్రి ని పురస్కరించుకొని పెద్ద ఎత్తున కార్యక్రమాలు ఉంటాయి. 16న రుద్రహోమం పూర్ణాహుతి కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. 17న ఉదయం 9 గంటలకు శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవం జరుగుతుంది. 18న శివతీర్థంతో కార్యక్రమాలు ముగుస్తాయని నిర్వాహకులు వెల్లడించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కుల హత్య

- హైర్ అండ్ ఫైర్ తో శ్రమ దోపిడీకి చట్టబద్ధత కల్పించడమే
- కార్మికుడి కడుపు ఆకలి, హక్కుల పోరాటంలో పాల్గొనని బీఎంఎస్ కార్మిక వ్యతిరేకి
- కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడానికి కార్మికులంతా ఏకం కావాలి
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు
- దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెతో మోడీ ప్రభుత్వం కళ్లు తెరవాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యకులు ప్రకాష్ రావ్
- సంగారెడ్డిలో భారీ బైక్ ర్యాలీ, సభ
- కార్మికుల ఆటా పాట.. వంట వార్పు



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 12 : లేబర్ కోడ్లతో కార్మిక హక్కుల హత్య చేయబడతాయని, హైర్ అండ్ ఫైర్ తో శ్రమ దోపిడీకి చట్టబద్ధత కల్పించడమే తప్ప మరోటి కాదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. ఈరోజు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సంగారెడ్డిలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై చుక్కారాములు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడానికి కార్మికులంతా ఏకం కావాలన్నారు. కార్మికుడి కడుపు ఆకలి..హక్కుల పోరాటంలో పాల్గొనని బీఎంఎస్ కార్మిక వ్యతిరేకే అన్నారు. ఇప్పటివరకు ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికులను మరింతగా దోచుకునే విధంగా లేబర్ కోడ్లు రూపొందించారని అన్నారు. లేబర్ కోడ్ల ద్వారా వేతనాల నిర్ణయంలో ఉన్న త్రైపాక్షిక విధానాన్ని రద్దు చేసి, 'ఒకే దేశం ఒకే వేతనం' పేరుతో రోజుకు రూ.178 కనీస వేతనం నిర్ణయించడం ద్వారా కార్మికుల ఆదాయం తగ్గే పరిస్థితి ఏర్పడిందని అలాగే పని గంటలను 8 నుంచి 12కు పెంచి, ఓవర్‌టైంకు అదనపు వేతనం చెల్లించకుండా చేస్తున్నారని ట్రేడ్ యూనియన్ నమోదు నిబంధనలను కఠినతరం చేసి, కార్మికుల సంఘటిత శక్తిని దెబ్బతీస్తున్నయని పరిశ్రమల లేఆఫ్, లాకౌట్, మూసివేతలకు సంబంధించిన నిబంధనలను సడలించి, యజమానులకు అనుకూలంగా మార్చారని, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ వంటి హక్కులను కాంట్రాక్ట్ కార్మికుల నుంచి క్రమంగా తొలగించే విధంగా కోడ్లు రూపొందించారని అనేక రాష్ట్రాల్లో ఉన్న కార్మిక సంక్షేమ బోర్డులను రద్దు చేసి, కార్మికుల విద్య, వైద్యం, వివాహ, ప్రసూతి సహాయాలను నిలిపివేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందని, వ్యవసాయ చట్టాలను రద్దు చేసినట్లు ప్రకటించినప్పటికీ దొడ్డిదారిగా అమలు చేస్తున్నారని రైతుకు గిట్టుబాటు ధర లేకుండా ఎరువులు పురుగుమందులు విత్తనాలు దారుల పెంచి రైతులకు మోసం చేస్తుందని,ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడంతో గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా లేకుండా పోయిందని లేబర్ కోడ్ల ద్వారా తనిఖీ వ్యవస్థను నిర్వీర్యం చేసి, కార్మికులకు శిక్ష యజమానులకు రక్ష అనే విధానాన్ని అమలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. సామాన్య ప్రజలను విస్మరించి, కేవలం సంపన్నుల ప్రయోజనాల కోసమే కేంద్రం నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాష్ రావు మాట్లాడుతూ ప్రజల కష్టార్జితమైన దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు మోడీ ప్రభుత్వం ధర దత్తం చేస్తుందని అన్నారు. కార్మికులందరూ కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేక చర్యలకు నిరసనగా కార్మికులందరూ పెద్ద సంఖ్యలో కదలడం చాలా సంతోషంగా ఉందని ఉన్నారు, కేంద్ర బిజెపి ప్రభుత్వం, విద్యుత్ సవరణ చట్టం 2025.విబి జీ రామ్ చట్టం, విత్తన సవరణ బిల్లు. ఎల్ఐసి లో 100% విదేశీ పెట్టుబడుదారులను అనుమతించడం. ఇలాంటి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం కోసం. కార్మికుల శ్రమను దోచుకోవడం కోసం, కేంద్ర బిజెపి ప్రభుత్వం దుర్మార్గమైన చట్టాలను తీసుకొస్తుందని, ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమ్మెతో మోడీ ప్రభుత్వం కళ్ళు తెరవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బీరం మల్లేశం, యాదగిరి, బాగారెడ్డి, ప్రసన్న రావు, రామదాసు, వెంకటరెడ్డి, శివ, అశోక్, కృష్ణ, వివిధ పరిశ్రమ రంగాల నాయకులు, కార్మికులు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎంఏ. రెహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటరాజ్యం, సెకండ్ anm రాష్ట్ర కార్యదర్శి శ్యామల, శివశంకర్,ర్.లక్ష్మి, వడ్డే అంజయ్య, బిహెచ్ఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సి. ప్రవీణ్, బాలరాజ్, శంకరప,ఏఐటీయూసీ సీనియర్ నాయకులు లింగమయ్య, ఏఐటియుసి జిల్లా కోశాధికారి జి. ఆంజనేయులు,సంతోష్‌గుప్త,సాయికుమార్, ఏఐటీయూసీ సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోయిన్ ప్రసాద్, పాడి పాల రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సంజీవరెడ్డి, సయెద్ సమద్, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాలకు చెక్ పెడదాం

- అగ్ని ప్రమాదాలపై పాతబస్తీలో హైడ్రా అవగాహన కార్యక్రమం
- మార్చి నెలనుంచి హైడ్రా తనిఖీలు ముమ్మరం
- నిబంధనలు పాటించకపోతే సీజ్: హైడ్రా కమిషనర్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 12: 'నిప్పుతో ఊహించని ముప్పు ఉంటుంది. 30 సెకెండ్ల సమయంలో మంటలు వ్యాపించే పరిస్థితి ఉంది. వచ్చేది వేసవి కాలం.. జాగ్రత్తలు తీసుకుంటే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు. అగ్ని మాపక నిబంధనలన్నీ తూచా తప్పకుండా అందరూ పాటించాలి. వచ్చేది వేసవి కాలం.. మరింత ప్రమాదం పొంచి ఉంది. నగరంలో జరిగిన అనేక అగ్ని ప్రమాదాలను పరిశీలిస్తే నిబంధనలు పాటించకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అందుకే హైడ్రా అగ్ని ప్రమాదాలపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే అవగాహన కార్యక్రమాలను పెద్ద యెత్తున చేస్తూ వస్తోంది..' అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అగ్ని ప్రమాదాలపై పాతబస్తీలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే జుల్ఫీకర్ తో కలిసి రంగనాథ్ గారు పాల్గొని ప్రసంగించారు. తరచూ జరుగుతున్న అగ్ని ప్రమాదాల నేపథ్యంలో జనవరి నెలాఖరులో తనిఖీలు చేపట్టి 9 షాపులను సీజ్ చేసినట్టు గుర్తు చేశారు. పలు వ్యాపార సంఘాల వినతుల మేరకు ఒక నెల రోజులు సమయం ఇచ్చామని.. మార్చి నెల రెండో వారం నుంచి తనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు. నిబంధనలు పాటించకపోతే ఆయా వ్యాపార సముదాయాలను, షాపులను సీజ్ చేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ చ్చరించారు.

వేధించడం కాదు.. జాగ్రత్త పడడం

అగ్ని ప్రమాదాల నేపథ్యంలో హైడ్రా తనిఖీలు చేయడం.. నిబంధనలు పాటించకని వ్యాపార సుముదాయాలను సీజ్ చేయడాన్ని వేధించడంగా భావించవద్దని.. జాగ్రత్త పడడంగా పరిగణించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఎవరైనా నిబంధనలు పాటించకపోతే తమకు సమాచారం ఇవ్వాలని వ్యాపార సంఘాల ప్రతినిధులతో పాటు.. పౌరులను హైడ్రా కమిషనర్ కోరారు. అగ్ని ప్రమాదాలకు ఎవరు బాధ్యులు అనేది గ్రహించాలని చార్మినార్ ఎమ్మెల్యే జల్ఫికర్ అన్నారు. ప్రమాదాలు జరగకముందే అప్రమత్తమవ్వాలని సూచించారు. రంజాన్ మాసం వ్యాపారాలు జరుగుతాయని, స్టాకును భద్రపరిచినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరికి వారు చెక్ చేసుకోవాలని సూచించారు. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, ఆర్ఎఫ్వో జయప్రకాష్, డీఎఫ్ఓలు యజ్ఞ నారాయణ, వెంకన్నగారు, విద్యుత్ విభాగం అధికారి ఏవీ రామారావు గారు, సిటీ ప్లానర్ శ్రీనివాస్ రెడ్డి గారితో పలు విభాగాలకు చెందిన అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్, జాతీయ విత్తన విద్యుత్ సవరణ
బిల్లును రద్దు చేయాలని నిరసన



ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 12: ఉద్యోగ కార్మిక రైతు సంఘాల దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజా హక్కులను కాలరాస్తూ కార్మిక ఉద్యోగ రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందన్నారు. దేశ ప్రజలకు నష్టం చేసే విధంగా కార్పొరేట్ సంస్థల యాజమాన్లకు జేబులు నింపడానికి కార్మిక చట్టాలను రద్దుచేసి తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలు జాతీయ విత్తన బిల్లు విద్యుత్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని అన్నారు. లేకుంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ఓటమి తప్పదన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చడం కార్మికుల హక్కుల కేంద్ర ప్రభుత్వం హరించడమే అన్నారు. స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు దాటిన కార్మికులు కనీస వేతనాలకు ఉద్యోగ భద్రతకు నోచుకోవడం లేదని విమర్శించారు. వామపక్షాల పోరాట ఫలితంగా 2005లో వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వల్ల గ్రామీణ పేదలు వ్యవసాయ కార్మికులు ఉపాధిని ప్రస్తుతం నరేంద్ర మోడీ ఉపాధి హామీ పనులను రద్దు చేయడం పేదల కడుపు మార్చే విధంగా ఉన్నదన్నారు. వెంటనే ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేసి ప్రజల ఆగ్రహానికి లోన్ కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సంఖ్య రవి, గోమస ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు రంగు రాజేశం, ఉద్యోగ సంఘాల నాయకులు కే ప్రభాకర్, పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు కుమారస్వామి, కొమ్ముల బాపు, హనుమత్ రెడ్డి, సాగర్ రెడ్డి సంతోష్, రామకృష్ణ, టి చిన్నయ్య, సురేందర్ మొగిలి, శంకర్, విష్ణు, సురేష్ నాయకులు పాల్గొన్నారు.

ఐదు మున్సిపాలిటీలలో గులాబీ జెండా ఎగురుతుంది

- కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండండి
- కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్ధులతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమీక్ష సమావేశం



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 12 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శకత్వంలో మాజీ మంత్రివర్యులు కేటీఆర్, హరీష్ రావుల నాయకత్వంలో పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలలో గులాబీ జెండా ఎగురవేసి.. కెసిఆర్ కు గిఫ్టుగా అందిస్తామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్ లో నియోజకవర్గం పరిధిలోని ఇంద్రేశం, ఇస్నాపూర్, గడ్డపోతారం, జిన్నారం, గుమ్మడిదల మున్సిపాలిటీలలో బిఆర్ఎస్ నుండి బరిలో దిగిన కౌన్సిలర్ అభ్యర్థులు, సీనియర్ నాయకులు, కౌంటింగ్ ఏజెంట్లతో ఎమ్మెల్యే జీఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగనున్న మున్సిపల్ ఓట్ల లెక్కింపు లో కౌన్సిలర్ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు నిర్దేశించిన సమయంలో గా హాల్ లోకి వెళ్లాలని సూచించారు. కౌంటింగ్ జరిగే సమయంలో ప్రతి ఓటును నిశితంగా పరిశీలించాలని ఏదైనా సందేహం అనిపిస్తే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాలని తెలిపారు. గెలుపు ధ్రువీకరణ పత్రం అందించే వరకు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అధిష్టానం సూచనలకు అనుగుణంగా గెలిచిన అభ్యర్థులందరూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యాంపులకు చేరుకోవాలని కోరారు. ప్రతిపక్ష పార్టీల ప్రలోభాలకు ఎట్టి పరిస్థితిలో లోను కాకూడదని.. అధిష్టాన నిర్ణయాన్ని ఉల్లంఘిస్తే పదవి కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రతి మున్సిపల్ పరిధిలోని సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు అభ్యర్థులతో సమన్వయం చేసుకోవాలని కోరారు. బూటకపు హామీలు. మోసపూరిత ప్రకటనలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గడచిన రెండున్నర సంవత్సరాలుగా ప్రజలకు చేసింది ఏమీ లేదని దుయ్యబట్టారు. 6 గ్యారంటీలను అమలు చేయకపోవడంతో పాటు ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ అభివృద్ధి సంక్షేమాలను తుంగలో తొక్కిందని ఆరోపించారు. ప్రజలు తిరిగి కెసిఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని.. ఇందుకు అనుగుణంగానే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, డిసిసిబి మాజీ వైస్ చైర్మన్ మాణిక్యం, మాజీ ప్రజా ప్రతినిధులు శంకర్ యాదవ్, సపాన దేవ్, సుధాకర్ రెడ్డి, బాల్ రెడ్డి. గోవర్ధన్ రెడ్డి. కుమార్ గౌడ్. వెంకటేష్, అంజయ్య యాదవ్, దేవానందం, తుమ్మల పాండురంగ రెడ్డి, యాదగిరి యాదవ్, శ్రీశైలం యాదవ్, సుధాకర్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, విజయ్ కుమార్, దశరథ్ రెడ్డి, నరసింహ గౌడ్, పృథ్వీరాజ్, లియకత్, హమీద్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

“



ఖేలో ఇండియా ప్రోగ్రామ్ నుంచి గత 3ఏళ్లలో 1,342 మంది అథ్లెట్లను తొలగించాం. పర్ఫార్మెన్స్, డోపింగ్ ఉల్లంఘనలే ఇందుకు కారణం. 3ఏళ్లలో 2,905 మంది కొత్తగా చేరారు. స్పోర్టింగ్ టాలెంట్‌ను గుర్తించి ట్రైనింగ్ ఇచ్చేందుకు కేంద్రం 2017లో ఈ ప్రోగ్రామ్‌ను లాంచ్ చేసింది. దీని కింద ప్రస్తుతం 23వేలకు పైగా అథ్లెట్లు శిక్షణ పొందుతున్నారు.

\- కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ

నాలుగు లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలి

- **సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం**
- **కార్మికులకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలి**
- **టీయూసిఐ జిల్లా కార్యదర్శి బోయిన్ పల్లి రాము**



ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, ఫిబ్రవరి 12: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్, విద్యుత్ చట్టాన్ని రద్దు చేయాలి. ఈ చట్టాలు కార్మిక వర్గానికి, దేశ రైతంగానికి తీవ్ర నష్టం కలిగించే విధంగా ఉన్నాయని అందుకే వీటిని రద్దు చేయాలనీ డిమాండ్ చేస్తూ గురువారం నారాయణ పేట్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్మిక కర్షక ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం, టీయూసిఐ జిల్లా కార్యదర్శి బోయిన్ పల్లి రాము ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. ఈ కోడ్స్ అమలులోకి వస్తే కార్మికుల హక్కులు కాలరాయబడతాయి, ఉద్యోగ భద్రత కోల్పోతారు, పని గంటలు పెరుగుతాయి, వేతనాలు మరియు సామాజిక భద్రత హక్కులు తగ్గిపోతాయి. ప్రత్యేకంగా సంఘటిత మరియు అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కోట్లాది కార్మికులకు ఈ లేబర్ కోడ్స్ శాపంగా మారనున్నాయి. యూనియన్ హక్కులను నిర్వీర్యం చేయడం, సమ్మె హక్కుపై ఆంక్షలు విధించడం, కాంట్రాక్ట్ విధానాన్ని ప్రోత్సహించడం వంటి నిబంధనలు కార్మిక వ్యతిరేక ధోరణిని స్పష్టంగా చూపిస్తున్నాయి. కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలు ఈ లేబర్ కోడ్స్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కార్మికుల అభిప్రాయాలను పట్టించుకోకుండా, సంప్రదింపులు లేకుండా తీసుకొచ్చిన ఈ చట్టాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి. ప్రభుత్వం కార్మిక వర్గ ప్రయోజనాలను కాపాడాలని, ఉన్న కార్మిక చట్టాలను బలోపేతం చేయాలని, లేబర్ కోడ్స్‌ను పూర్తిగా రద్దు చేయాలని అన్నారు. ఈ డిమాండ్‌ను పట్టించుకోకపోతే భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరిస్తున్నామన్నారు. టీయూసిఐ జిల్లా ఉపాధ్యక్షులు బి. నర్సింహా, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గోవిందా రాజు అధ్యక్షత వహించగా సమ్మె కు మద్దతుగా పిఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జయ, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామి రెడ్డి, సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్, జిల్లా నాయకులు కాశీనాథ్, ఏఐయూకెఎస్ జిల్లా కార్యదర్శి యాదగిరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, ఏఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజలయ్య గౌడ్, మాట్లాడారు. ఈ సమ్మెలో గ్రామ పంచాయతీ, అంగన్వాడీ, ఆశ వర్కర్స్, రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు. అనంతరం కార్మిక ప్రదర్శన ధర్నా చౌక్ నుండీ పాత బస్టాండ్ మీదుగా నర్సి రెడ్డి చౌక్ చేరుకొని ముగించారు.

'గీతం'లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 12 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదు ఈనెల 18, 20తేదీలలో రెండు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించనుంది. సాంకేతిక నైపుణ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులు, అధ్యాపకులు, స్కాలర్ల పరిశోధనా నైపుణ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు గురువారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్ (ఏఐ & డీఎస్) విభాగం ఆధ్వర్యంలో ఈనెల 18న 'అనిశ్చితిలో డేటాఆధారిత నిర్ణయం తీసుకోవడం' అనే అంశంపై డాక్టర్ బిస్మార్క్ సింగ్ ఆతిథ్య ఉపన్యాసం చేయనున్నారు. అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల విశ్లేషణాత్మక, సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా, మధ్యాహ్నం అధ్యాపకులు, పరిశోధనా స్కాలర్ల కోసం పరిశోధనపై చర్చా గోష్ఠిని నిర్వహిస్తున్నామని, వీటిని డాక్టర్ చంద్రశేఖర్ ఉద్దగిరి సమన్వయం చేస్తారని వెల్లడించారు. తన విద్యా కార్యక్రమాలను మరింత విస్తరిస్తూ, గీతం ఫిబ్రవరి 20, 21 తేదీలలో 'క్వాలిటీ బై డిజైన్ (క్యూబీడీ): ఫార్మాస్యూటికల్ పరిశోధనలో ప్రయోగాల రూపకల్పన (డీవోఈ) ను సమగ్రపరచడం' అనే అంశంపై రెండు రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. ఔషధ ఆవిష్కరణ, అభివృద్ధి, విశ్లేషణాత్మక శాస్త్రాలు, నాణ్యత హామీ,



నియంత్రణ శాస్త్రం వంటి ఔషధ పరిశోధన యొక్క వివిధ దశలలో డీవోఈ, గణాంక సాధనాల వినియోగంపై ఈ కార్యక్రమం దృష్టి పెడుతుందన్నారు. విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణుల మధ్య అర్థవంతమైన పరస్పర చర్య, జ్ఞాన మార్పిడి కోసం ఒక క్రియాశీలక వేదికను అందించడం ఈ కార్యక్రమ లక్ష్యమని, దీనిని డాక్టర్ పవన్ కుమార్ చింతమనేని సమన్వయం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా, పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలను పెంపొందించడానికి, అంతర్ విభాగ పరిశోధనలను ముందుకు తీసుకెళ్లడానికి గీతం హైదరాబాద్ తన నిబద్ధతను కొనసాగిస్తున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



చీఫ్ మినిస్టర్స్ కప్ పోటీలు ప్రారంభం

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఫిబ్రవరి 12: జిల్లా స్థాయి చీఫ్ మినిస్టర్స్ కప్-2025 (2వ ఎడిషన్)ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఘనంగా ప్రారంభించారు. కామారెడ్డి జిల్లా స్థాయి చీఫ్ మినిస్టర్స్ కప్-2025 టోర్నమెంట్ల 2వ ఎడిషన్ గురువారం ఇందిరాగాంధీ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ , అదనపు కలెక్టర్ విక్టర్ లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడలు యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. చీఫ్ మినిస్టర్స్ కప్ వంటి పోటీలు గ్రామీణ పట్టణ ప్రాంతాల యువతకు తమ ప్రతిభను చాటుకునే వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతిభావంతులైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించి, జిల్లాకు కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడాకారులు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ క్రీడా విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ఈ సందర్భంగా ఈ క్రీడా పోటీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ మొదటగా కబడ్డీ ఆడుతూ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రీడా అధికారులు వెంకటేశ్వర్లు గౌడ్, ఆర్డీవో వీణ, తహసిల్దార్ జనార్ధన్, పీడీ మెప్మ , కోచ్ లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ మొండి వైఖరిపై వర్కర్ల ఆగ్రహం

- **గుండాల ఏకలవ్య పాటశాలలో ఆందోళన**

ప్రతిపక్షం, గుండాల, ఫిబ్రవరి 12 : గుండాల మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం వర్కర్లు ఆందోళనకు దిగారు. హాస్టల్‌లో గత వారం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయినా ప్రిన్సిపాల్ స్పందించకపోవడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారిందని వర్కర్లు ఆరోపించారు. బోర్లు కారాబు అయి వారం రోజులు గడుస్తున్నా ఇంతవరకు రిపేర్ చెపియ లేదని అన్నారు.నీళ్లు లేకపోవడం వల్ల వంట చేయడం, గదులు శుభ్రం చేయడం, వాష్‌రూమ్‌లను క్లీన్ చేయడం వంటి పనులు పూర్తిగా అస్తవ్యస్తమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం మిషన్ భగీరథ నీటిని వంటకు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. అయితే మిషన్ భగీరథ నీటితో వంట చేస్తే రుచి ఉండటం లేదని వర్కర్లు తెలిపారు.తమ సమస్యలను పలుమార్లు ప్రిన్సిపాల్ నితిన్ సింగ్ దృష్టికి తీసుకెళ్లినా ఆయన పట్టించుకోవడం లేదని వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా వర్కర్లకు కనీస గౌరవం ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. "ఏ పని గురించి చెప్పినా సరైన స్పందన ఉండదు. ఆయన మొండి వైఖరి వల్లే ఇవన్నీ జరుగుతున్నాయి" అంటూ వర్కర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో పని విభజన సరిగా లేకపోవడంతో తమపై అధిక పనిభారం పడుతోందని వర్కర్లు తెలిపారు. వంట చేసే వర్కర్లకు స్వీపింగ్ పనులు అప్పగించడం, స్వీపింగ్ వర్కర్లను వంట చేయమని చెప్పడం వంటి చర్యలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీంతో భోజనం చేయడానికి కూడా సమయం దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా విద్యార్థులు తమ సమస్యల గురించి మాట్లాడుతూ హాస్టల్‌లో వారం రోజులుగా నీటి సరఫరా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తాగునీరు, స్నానం, శుభ్రత వంటి అవసరాలకు నీరు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ నిర్లక్ష్య వైఖరి కారణంగానే సమస్యలు పెరుగుతున్నాయని వారు ఆరోపించారు.వెంటనే హాస్టల్‌లో నీటి సరఫరా పునరుద్ధరించాలని, అలాగే పని విభజనను సక్రమంగా నిర్వహించాలని వర్కర్లు,విద్యార్థులు డిమాండ్ చేశారు.



ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలి

- **టీయూసీఐ జిల్లా అధ్యక్షులు ఎస్ కిరణ్**


ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, ఫిబ్రవరి 12: కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఊడిగం చేయడానికి కార్మికులను కట్టు బానిసలుగా మార్చడానికి నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకొచ్చింది. దీనిని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని టీయూసీఐ జిల్లా ఎస్ కిరణ్ అన్నారు. ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె లో భాగంగా మక్తల్ లో టి యు సి ఐ ఆధ్వర్యంలో కిరాణం మర్చంట్ భవనంలో సార్వత్రిక సమ్మె సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీయూసీఐ జిల్లా నాయకుల కొలిమి రాములు అధ్యక్షత వహించగా, టీయూసీఐ జిల్లా అధ్యక్షులు ఎస్ కిరణ్, కేవిపిఎస్ జిల్లా అధ్యక్షులు డి చంద్రశేఖర్, ఏఐయుకేఎస్ జిల్లా అధ్యక్షులు భగవంతు హాజరై ప్రసంగించారు. కేంద్రంలో ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని కార్మిక వర్గాన్ని బలిచ్చేందుకు తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోసం రద్దు చేయాలని అన్నారు. కనీస వేతనం 26 వేలు, నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని అన్నారు. ప్రభుత్వాలు లేబర్ కోడ్ అమలు చేస్తామని బాహాటంగా ప్రకటించి అమలు పూలుకుంటుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాన్ని 10 గంటల పని దినంగా మార్చిందన్నారు. రాత్రి షిఫ్టులో మహిళలు పనిచేయాలని నిర్ణయించింది, దేశంలో అనేక రాష్ట్రాల్లో నాలుగు లేబర్ కూడా సాగుతో కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్ కఠినంతన చేశారు. ఎప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని దశాబ్దాల పాటు కార్మిక వర్గం పోరాడి సాధించిన కార్మిక చట్టాలను కాపాడుకోవడానికి కార్మికుల ఐక్యంగా ఉద్యమం చేయాలని వారు పిలుపునివ్వడం జరిగింది. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాలు కాపాడుతున్న గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వకుండా ఉంటే కుటుంబాలు గడవడం గడ్డు పరిస్థితిగా ఉంది. వర్షాకాలం సీజన్ కాబట్టి గ్రామపంచాయతీ కార్మికులు లేకుంటే గ్రామాలు పరిశుభ్రంగా ఉండవు ప్రజలు అనారోగ్యాలతో తీవ్ర ఇబ్బందులు పడతారని వారు ఆరోపించారు. కావున గ్రామపంచాయతీ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని లేనియెడల పెద్ద ఎత్తున అందోళన చేస్తామని అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో టియుసిఐ పద్మక్క, నరేష్ , నరసింహ, వెంకటయ్య , సువన్న, జి క్రిష్ణయ్య, బండారి మల్లేష్, నరేందర్, రాయకూడ అంజి, బండారి బాలు, జగ్గలి బాబు, అంజన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

- **కౌంటింగ్‌కు పటిష్ట భద్రత ఏర్పాట్లు**
- **ఎస్పీ రోహిత్ రాజు**

ప్రతిపక్షం, కొత్తగూడెం, ఫిబ్రవరి 12: మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతి లేదని తెలిపారు. అలాగే డీజేల వినియోగం, బాణాసంచా కాల్చడం నిషేధమని స్పష్టం చేశారు. స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత ఉంటుందని, పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌లతో నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో 163 బీఎన్ఎస్ఎస్ పకడ్బందీగా అమల్లో ఉంటుందని వెల్లడించారు. ఎన్నికల అధికారులు జారీ చేసిన గుర్తింపు కార్డులు ఉన్నవారికే లెక్కింపు కేంద్రంలోకి అనుమతి ఉంటుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



గిరిజన ఆవాసాలకు విద్యుత్ సర్వీసులు

- **మార్చి 31లోపు పూర్తి చేయాలి**
- **సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 12: టీజీఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 సర్కిళ్లలో గిరిజన ఆవాసాల విద్యుదీకరణకు సంబంధించిన అన్ని సర్వీసుల మంజూరు పనులను మార్చి 31లోపు పూర్తి చేయాలని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ కార్పొరేట్ కార్యాలయం నుండి 17 సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, డివిజనల్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎండీ మాట్లాడుతూ ఇప్పటివరకు పూర్తైన పనులకు వెంటనే మీటర్లు ఏర్పాటు చేసి, గృహజ్యోతి పథకం ప్రయోజనం లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో వారికి ఉచిత విద్యుత్ సౌకర్యం అందుతుందని తెలిపారు. మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. రియల్‌టైమ్ ఫీడర్ మానిటరింగ్‌లో పెండింగ్‌లో ఉన్న సబ్‌స్టేషన్ల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని తెలిపారు. హెచ్‌టీ సర్వీసులు, ఫీడర్లకు ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ అమలు పురోగతిపై సమీక్షిస్తూ, సంబసంబంధిత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇకపై కొత్తగా విడుదలయ్యే సర్వీసులను కూడా పరిధిలోకి తీసుకురావాలని అన్నారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణాల్లో లోడ్ పెరుగుదల అంచనాల మేరకు సామర్థ్య పెంపు, అప్‌గ్రేడేషన్ పనులు ముందస్తుగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సిఈలు సురేందర్ శ్రవణ్ కుమార్, జీఎంలు శ్రీనివాస్, నాగప్రసాద్ శ్రీకాంత్,డిఈలు ప్రభావతి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- **విద్యుత్ సవరణ బిల్లు 2025 ని వెనక్కి తీసుకోవాలి**
- **వీబీ జీ రామ్ జీ చట్టం, విత్తన సవరణ బిల్లును వెంటనే సంహరించుకోవాలి**
- **సిద్దిపేట జిల్లా కేంద్రంలో సమ్మెలో కార్మిక సంఘాల డిమాండ్**



ప్రతిపక్షం, సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 12: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని విద్యుత్ రంగంలో తీసుకొస్తున్న నూతన విద్యుత్ చట్టాన్ని,ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి దాని స్థానంలో తెస్తున్న వి బి జి రాంజీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని విత్తన సవరణ బిల్ల, ఎల్ఐసి లో 100% విదేశీ పెట్టుబడులను వెంటనే వెనక్కి తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల్ స్వామి హెచ్ఎంఎస్ జాతీయ నాయకుడు సుదర్శన్ రావు ,బి ఆర్ టి యు రాష్ట్ర నాయకులు నారాయణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కృష్ణపురం లక్ష్మణ్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రోజున కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు సిద్దిపేట జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో స్థానిక చర్చి కాంపౌండ్ నుండి పాత బస్టాండ్ వరకు భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను 2020లోనే తెచ్చిందన్నారు. అన్ని రాష్ట్రాలు అమలు చేయాలంటూ 2025 నవంబర్ 21న నోటిఫికేషన్ జారీ చేసిందని, కార్పొరేట్ జేబులు నింపడానికి తప్ప కార్మికుల ప్రయోజనాలను కాపాడే దిశగా కేంద్రం చర్యలు లేవని వారు అన్నారు. మరోవైపు ప్రజలపై భారాలు మోమోపేందుకు విద్యుత్తు రంగంలో ప్రైవేటు పెట్టబడును ఆశ్రయించి నూతన విద్యుత్ సవరణ బిల్లు పేరుతో ప్రజలపై మరింత భారాలు వేసే విధంగా చర్యలు చేపట్టిందని ఇట్టి 2025 నూతన విద్యుత్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతాంగ వ్యవసాయ కూలీల ప్రజా వ్యతిరేక విధానాల వెనక్కి తీసుకోకపోతే దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామని సందర్భంగా హెచ్చరించారు. ఈ సమ్మె కార్యక్రమానికి సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్ల బండి శశిధర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగర వెంకట్ , మావో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం పద్మ, అమ్ముల బాల్ నర్సయ్య జిల్లా సహాయ కార్యదర్శి. చొప్పరి రవికుమార్, మామిడాల కనకయ్య, ఇప్పకాయల శోభ, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి శిరీష, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భక్తుల అభిషేక్, బీఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు పిండి అరవింద, బిఆర్టియు జిల్లా నాయకులు గుండు సంజీవులు నరసింహులు ,దుర్గం శ్రీనివాస్ బాయికాడ శ్రీనివాస్, శ్రీమతి ఏఐటీయూసీ బెక్కంటి సంపత్ చంద్రం,మల్లేశం హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ఈ దారి మల్లేశం హెచ్ఎంఎస్ జిల్లా నాయకులు మధు కౌసల్య లలిత తదితరులు పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు

- **పట్టించుకోని విద్యుత్ అధికారులు**
- **ప్రమాదాల నుండి కాపాడాలని రైతుల వేడుకోలు**



ప్రతిపక్షం చేర్యాల, ఫిబ్రవరి 12: చేర్యాల మండల పరిధిలోని ఆకునూరు గ్రామంలోని తోకల గట్టుమల్లయ్య, తోకల కొమురయ్య, దొండకాయల కిష్టయ్య, అబ్బు ప్రభాకర్, మండేపల్లి సారయ్య లకు చెందిన రైతుల వ్యవసాయ పొలాల దగ్గర చేతికందేలా విద్యుత్తు తీగలు వేలాడుతూ ప్రమాదానికి నిలయంగా మారాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాటు వేస్తుంటే తీగలు తెగి పడడంతో రైతులు, కూలీల మీద పడే ప్రమాదం నుంచి తప్పించుకున్నామన్నారు. మధ్యలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ప్రమాదాల నుండి కాపాడాలని విద్యుత్ అధికారులకు అనేకసార్లు మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మధ్యలో స్తంభం వేసి ప్రమాదం నుండి కాపాడాలని వేడుకున్నారు.

ప్రాంతీయం



'పాలమూరు-రంగారెడ్డి'ని ఏపీ అడ్డుకుంటోంది. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసుకోవచ్చని విభజన చట్టంలో ఉన్నా ఎందుకు అడ్డుకుంటున్నారు? మీ ఇష్టమొచ్చినట్లు మీరు చేస్తే మాకు నచ్చినట్లు మేమూ చేస్తాం. గోదావరి జలాల్లో మాకూ 960 టీఎంసీల వాటా ఉంది. బేసిన్ అవసరాలు తీరాకే ఇతర బేసిన్లకు నీటిని తరలించాలి. మిగులు జలాల్లో చెరిసగం వాడుకోవచ్చు. చర్చలతో సమస్య తీరుతుంది.

- సీఎం రేవంత్ రెడ్డి

ప్రాంతీయం



భద్రత నడుమ మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్

- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 12 : మెదక్ మున్సిపాలిటీ కౌంటింగ్ ప్రక్రియ శుక్రవారం జరగనున్న నేపథ్యంలో వేస్లీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బ్రీఫింగ్ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా కౌంటింగ్ సెంటర్‌లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కౌంటింగ్ సెంటర్‌లోకి ప్రవేశించే ప్రతి వ్యక్తిని కచ్చితంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. చెల్లుబాటు అయ్యే అనుమతిపత్రాలు ఉన్నవారికే ప్రవేశం కల్పించాలని, ఇతరులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని స్పష్టం చేశారు. మహిళా అభ్యర్థులను మహిళా సిబ్బందిచే మాత్రమే తనిఖీ చేయాలని ప్రత్యేకంగా సూచించారు. మొబైల్ ఫోన్లు, ఇతర పరికరాలను కౌంటింగ్ సెంటర్‌లోకి అనుమతించబోమని తెలిపారు. భద్రతా పరంగా విధించిన నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో నిపక్షపాతంగా, నిబద్ధతతో వ్యవహరించాలని, ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు.అభ్యర్థులు మరియు వారి ఏజెంట్లు పోలీసులచే కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే వాహనాలు పార్క్ చేయాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్ 163 అమలులో ఉంటుందని, నాలుగురికి మించి గుంపుగా చేరడం నిషేధమని తెలిపారు. ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, డీజేలు, టపాకాయలు కాల్చడం, ఊరేగింపులు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు.



ఓట్ల లెక్కింపులో ఆర్వోల పాత్ర కీలకం

- కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి12 : మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఆర్వోలు, సూపర్వైజర్లు, అసిస్టెంట్ సూపర్వైజర్లు ,మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్ రాజ్ ఎన్నికల అధికారులకు సూచించారు. గురువారం వెస్లీ పాఠశాలలోని మున్సిపల్ ఎన్నికల స్ట్రాంగ్ రూమును, కౌంటింగ్ హాలును జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్ , డిఎస్పీ ప్రసన్నకుమార్,ఆర్డీవో రమాదేవితో కలిసి పరిశీలించారు. కౌంటింగ్ సిబ్బందికి పలు సూచనలు,సలహాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూమ్ కు పోలీస్ మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కౌంటింగ్ రోజు ఆర్వోలు, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు,ఉదయం 5:45 లోపల కౌంటింగ్ కేంద్రంలో ఉండాలన్నారు. కౌంటింగ్ హాలులో ఫోను అనుమతి లేదన్నారు.ఓట్ల లెక్కింపు రౌండ్ల వారీగా, టేబుల్ వారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి,జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి,ఆర్వోలు, సూపర్వైజర్లు అసిస్టెంట్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన అదనపు ఎస్పీ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి 12: మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని వేస్లీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ మరియు కౌంటింగ్ సెంటర్‌ను మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ గురువారం పరిశీలించారు.శుక్రవారం నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఆయన ప్రత్యక్షంగా సమీక్షించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన మూడు స్థాయిల భద్రత, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ, ప్రవేశ-నిష్క్రమణ ద్వారాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు తదితర అంశాలను పరిశీలించారు. అనుమతి లేని వ్యక్తులు స్ట్రాంగ్ రూమ్ వద్దకు చేరకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అభ్యర్థులు,వారి ఏజెంట్లు మరియు ఇతరులు పోలీసులు సూచించిన ప్రదేశాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు.కౌంటింగ్ సెంటర్‌లోకి మొబైల్ ఫోన్లు తీసుకువెళ్లడం పూర్తిగా నిషేధమని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. మెదక్ జిల్లాలో పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమల్లో ఉన్నందున అనుమతి లేకుండా సభలు,సమావేశాలు నిర్వహించడం నిషేధమని పేర్కొన్నారు. కౌంటింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుళ్లు, అభ్యర్థుల ఏజెంట్లకు కేటాయించిన స్థానాలు, మౌలిక సదుపాయాలపై అధికారులతో చర్చించారు.లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా,ఎన్నికల నియమావళి ప్రకారం సజావుగా సాగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ భద్రత కొనసాగుతుందని, ప్రజలు మరియు అభ్యర్థులు పోలీసులకు సహకరించాలని అదనపు ఎస్పీ విజ్ఞప్తి చేశారు.అదనపు ఎస్పీ వెంట మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ సీఐ మహేష్, ఆర్ఎస్ఐ మహిపాల్, ఎస్ఐ శిరీష తదితర సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి 12: మెదక్ జిల్లా హవేళి ఘనపూర్ మండల పరిధిలోని మద్దుల్వాయి ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారిగా సాత్విక్, మండల విద్యాధికారిగా త్రిశూల్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా జశ్వంత్, ప్రధానోపాధ్యాయులుగా హర్షవర్ధన్ వ్యవహరించారు. ఐదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు బోధన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘు బాబు మాట్లాడుతూ...విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీసేందుకు ఇలాంటివి ఉపకరిస్తాయన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు సంతోషి కుమారి, నర్సింలు పర్యవేక్షించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

గ్రామీణ క్రీడాకారులను వెలికి తీసేందుకే సీఎం కప్

- జిల్లా కలెక్టర్ హైమావతి



ప్రతిపక్షం, సిద్దిపేట, ఫిబ్రవరి 12: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను గుర్తించి అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేలా చేయడమే సీఎం కప్పు ఉద్దేశమని జిల్లా కలెక్టర్, స్పోర్ట్స్ చైర్పర్సన్ హైమావతి అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన సెకండ్ ఎడిషన్ సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలో ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం క్రీడాకారులను వారిలో దాగి ఉన్న ప్రతిభ పాటలను వెలికి తీయాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పోటీల నిర్వహణను చేపడుతుందని అన్నారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులను క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత పి. ఈ.టిల పైన ఉన్నదని చెప్పారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా ఏదో ఒక క్రీడలలో పాల్గొనాలని సూచించారు. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదం చేస్తాయని తెలిపారు. టీం స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొని చివరి అవకాశం వరకు కలుపు కోసం క్రీడాకారులు కృషి చేయాలని అన్నారు. సిద్దిపేట జిల్లా క్రీడల్లో ముందుందని క్రీడ ఉపాధ్యాయుల సలహాలు, సూచనలను తీసుకొని మరింత ప్రాక్టీస్ చేసి రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి సిద్దిపేట బ్రాండ్ ను కొనసాగించాలని క్రీడాకారులకు సూచించారు. వచ్చే సంవత్సరం తప్పనిసరిగా వ్యాయామ విద్య పీరియడ్లకు ఉండేటట్టుగా చర్యలు చేపడుతున్నట్టుగా చెప్పారు. సీఎం కప్ సిద్దిపేట జిల్లా స్థాయి క్రీడోత్సవాలు ఈనెల 12వ తేదీ నుండి 14వ తేదీ వరకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఇప్పటివరకు గ్రామ క్లస్టర్ మండల్ నియోజకవర్గ స్థాయిలలో ఈ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి దశకు ఎంపిక చేశారు. సిద్దిపేట, గజ్వేల్, కొండపాక కేంద్రాలలో 21 క్రీడాంశాలలో మూడు రోజులపాటు పోటీలు జరుగుతాయి. ఈ జిల్లా స్థాయి పోటీలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలో పాల్గొనే సిద్దిపేట జిల్లా జట్లకు ఎంపిక చేయడం జరుగుతుంది. రాష్ట్రస్థాయి పోటీలో విజేతలుగా నిలిచే క్రీడాకారులకు స్వర్ణ పతకానికి 25000 రజతానికి 15000 కాశ్య పతకానికి పదివేల రూపాయలు ప్రభుత్వం అందజేయడం జరుగుతుంది చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు జెడ్పి సీఈవో రమేష్, డీఎస్సీడీవో హమీద్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రవి నాయక్, పాఠశాలలో క్రీడా కార్యదర్శి సౌందర్య, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు అశోక్, కార్యదర్శి హరికిషన్, వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, క్రీడా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.. అనంతరం పోటీల ప్రారంభ సూచికంగా శాంతి కపోతాలు ఎగరవేసారు.. కాగా నేడు బాలుర విభాగంలో కబడ్డీ ,వాలీబాల్ ,కోకో, ఫుట్బాల్, హ్యాండ్ బాల్ పోటీలతో పాటు వ్యక్తిగత క్రీడా క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకుల తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రతిపక్షం, చేగుంట, ఫిబ్రవరి 12: చేగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని మాసాయిపేట 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మరణించారు. రోడ్డుకు అంతరాయం ఏర్పడడంతో అటుగా వస్తున్న మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ ఎస్పీ మహేందర్ ట్రాఫిక్ క్లియర్ చేయించారు. మృతి చెందిన బైక్ ఈస్ట్ ను పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మల్లన్న సాగర్ నుంచి నీటి విడుదల

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 12: నియోజకవర్గంలోని కొడకండ్ల గ్రామం గుండ మల్లన్న సాగర్ నుండి కొండపోచమ్మ సాగర్ కాలువకు వెళ్లే గేట్ వద్ద నుండి సాగునీటిని స్థానిక కాంగ్రెస్ నాయకులు గురువారం నాడు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వి. నరేందర్ రెడ్డి, గజ్వేల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుకేందర్ రెడ్డి పాల్గొన్నారు.అలాగే కొడకండ్ల సర్పంచ్ ముంద్రాతి లక్ష్మీ కొండయ్య, రిమ్మనగూడ సర్పంచ్ కరుణాకర్, పిడిచెడ్ సర్పంచ్ అశోక్ రెడ్డి, సింగాటం సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, కోమటిబండ సర్పంచ్ అమరేందర్ మరియు మాజీ సర్పంచ్‌లు తేరాల విజయ శ్రీనివాస్, చంద్రం, ఐలయ్య, మాధవరావు హాజరయ్యారు. ఉప్ప సర్పంచ్‌లు నర్సింలు (బుజ్జి) రిమ్మనగూడ, కరుణాకర్ (పీ.టి. వెంకటాపూర్) పాల్గొన్నారు. ఈ నీటి విడుదలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ, తమ పంటలకు అవసరమైన నీటి సమస్యకు తాత్కాలిక ఉపశమనం లభించిందని తెలిపారు. నాయకులు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు.



విజయోత్సవ ర్యాలీలు నిషేధం

- మెదక్ అడిషనల్ ఎస్పీ మహేందర్

ప్రతిపక్షం, చేగుంట, ఫిబ్రవరి 12: మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన కౌన్సిలర్లు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం నిషేధమని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. తూప్రాన్ లోని నోబెల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలీస్ శాఖ సిబ్బందితో ఆయన ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. సెక్షన్ 144, 163 నిషేధజ్ఞలు అమలులో ఉన్నాయని ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు జిల్లా కలెక్టర్ ద్వారా పొందిన గుర్తింపు కార్డులు లేదా ఎలాంటి గుర్తింపు కార్డు అయినా తీసుకురావాలన్నారు. సెల్ఫోన్ సెల్ ఫోన్లు సిగర్ లైట్లు అగ్గిపెట్టెలు ఇంకు బాటిల్స్ టపాసుల వంటి పేలుడు పదార్థాలు నిషేధించినట్లు తెలిపారు. గెలుపొందిన అభ్యర్థులు బైక్ ర్యాలీలు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదన్నారు . ఈ సమావేశంలో తూప్రాన్ డిఎస్పి రంగనాయక్ సిఐ రంగాకృష్ణ తుఫాన్ ఎస్సై గంగరాజు మనోహరాబాద్ సుభాష్ గౌడ్ చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మల్లన్న హుండీ లెక్కింపులో ఉద్యోగి చేతివాటం

- రూ. 9 వేలు చోరీ చేస్తూ పట్టుబడిన ఆలయ ఉద్యోగి
- పోలీసులకు అప్పగించిన అధికారులు

ప్రతిపక్షం, కొమురవెల్లి, ఫిబ్రవరి 12: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లన్న ఆలయంలో హుండీ లెక్కింపులో ఓ ఉద్యోగి చేతివాటం ప్రదర్శిస్తూ పట్టుబడ్డాడు. ఆలయంలో ప్లంబర్‌గా విధులు నిర్వహిస్తున్న సార్ల విజయ్ కుమార్ అనే ఉద్యోగి మల్లన్న ఆలయ హుండీ లెక్కింపులో 18 నోట్లు రూ.500 నోట్లు అనగా రూ.9 వేలు చోరీ చేస్తూ పట్టుబడ్డాడు. సార్ల విజయ్ కుమార్ హుండీ లెక్కింపులో మధ్యాహ్నం సమయంలో హుండీ లెక్కింపులో మహిళల వద్ద రూ. 500 నోట్లు జమ చేస్తున్న క్రమంలో అందులో నుంచి 18 నోట్లు రూ. 500 నోట్లు రూ 9 వేలు కొంతమంది మహిళల వద్ద తీసుకొని సైడ్ కు వెళ్ళి అండర్వేరు లోని జేబులో పెట్టుకొని బయటకు వెళ్ళుతున్న క్రమంలో ఆలయ హోమ్ గార్డు అతనిన్ని చెక్ చేశాడు. అండర్వేరులోని రూ. 9 వేలు దాచుకున్నట్టు బయటపడింది. వెంటనే ఆలయ ఈఓ వెంకట్, దేవాదాయ ఇన్స్పెక్టర్ పీ.విజయలక్ష్మిలు దగ్గరకు వెళ్ళి అదుపులోకి తీసుకుని చెక్ చేశారు. అది గమనించిన హోంగార్డు ఎం. శ్రీనివాస్ అతనిని బాత్రూంలోకి తీసుకువెళ్లి చెక్చేశారు. దీంతో అతని వద్ద రూ 9 వేలు లభించాయి. వెంటనే ఆలయ అధికారులు సీసీ కెమెరాను పరిశీలించి అతనిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఈవో తెలిపారు. ఈ విషయంపై ఆలయ ఈఓ టంకశాల వెంకట్ పోలీసులకు పిర్యాదు చేయడంతో చోరీ చేసిన ఆలయ ఉద్యోగి ప్లంబర్ విజయ్ కుమార్ ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మల్లన్న హుండీ
ఆదాయం రూ.90,42,186

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో హుండీ ఆదాయం రూ.90 లక్షల 42 వేల 186 వచ్చింది. గురువారం కొమురవెల్లిలోని ఆలయ ముఖమండపంలో ఈఓ టీ.వెంకటేష్, దేవాదాయ ఇన్స్పెక్టర్ పీ.విజయలక్ష్మి పర్యవేక్షణలో హుండీలను లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునస్వామి దేవస్థానంలో 21 రోజుల హుండీలను లెక్కింపు నిర్వహించగా రూ.90 లక్షల 42 వేల 186 నగదు, మిశ్రమ బంగారం 47 గ్రాములు, మిశ్రమ వెండి 005 కిలోలు రాగ వచ్చిన మొత్తం డబ్బులను స్థానిక SBI బ్యాంకులో జమ చేసినట్లు ఆలయ ఈఓ టీ.వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ బుద్ది శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మల్లికార్జున్, మల్లన్న ఆలయ కమిటీ చైర్మన్ గంగం నర్సింహ్మారెడ్డి, ధర్మకర్తలు సార్ల లింగం, బొచ్చు ఎల్లయ్య, చిగురు కొమురయ్య, వంగిరి పరలక్ష్మి నాగరాజు, అర్చకులు, ఆలయ సిబ్బంది, శ్రీ శివ రామ కృష్ణ భజన మండలి సేవ సమితి సేవ సభ్యులు పాల్గొన్నారు. కాగా కొమురవెల్లి ఎస్ఐటీ మహేష్ పోలీస్ సిబ్బందితో బందోబస్త్ నిర్వహించారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

- దేశవ్యాప్త సమ్మె విజయవంతం
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మ శ్రీ



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 12: మెదక్ జిల్లా కేంద్రంలో ఐబీ నుండి రాందాస్ చౌరస్తా వరకు సీఐటీయూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన, ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి పద్మ శ్రీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం2025, విబి జిరామ్ జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసీలో 100% విదేశీ పెట్టుబడులను అనుమతించడం లాంటి ప్రమాదకర నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక సంఘాలు, కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని, కార్మికుల్ని కట్టు బానిసలుగా చేసి పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్లకు మేలు చేస్తుందని విమర్శించారు. అందులో భాగంగానే వీరోచితంగా పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ లను తెచ్చిందనీ విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి విబి జిరామ్ జీ స్కీమ్ తెచ్చి రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపిందనీ, విద్యుత్ సవరణ బిల్లు 2025, విత్తన సవరణ చట్టం, ఇన్సూరెన్స్ రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి లాంటి మరిన్ని వినాశకరమైన చట్టాలను, బిల్లులను తీసుకొచ్చి శ్రమజీవులపై దాడి చేస్తుందని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తారంగా ఉన్న శ్రామిక వర్గాలను మోసం చేస్తుందన్నారు. బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాడి సాధించుకున్న ట్రేడ్ యూనియన్ చట్టం 1926 ప్రకారం యూనియన్ల ఏర్పాటు కార్మికుల హక్కుగా పొందారు. కానీ ఈ లేబర్ కోడ్లతో కార్మికులు సంఘం పెట్టే హక్కు, సంఘటితమయ్యే హక్కు, నిరసనలు, సమ్మె చేసే హక్కులపై ఉక్కుపాదం మోపారనీ, ఉద్యోగ భద్రత పట్ల యాజమాన్యాలకున్న అన్ని బాధ్యతలను తొలగించారనీ. హైర్ & ఫైర్ పద్ధతిని తీసుకొచ్చి పర్మినెంట్ ఉద్యోగాలకు మంగళం పాడారనీ కోర్ యాక్టివిటీలో సైతం విచ్చలవిడిగా కాంట్రాక్ట్ కార్మికులను నియమించుకోవడం చట్టపరం చేయడం దుర్మార్గం అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్, వ్య క స జిల్లా అధ్యక్షులు దేవయ్య, ఎన్పీఆర్డీ జిల్లా కార్యదర్శి యశోద నాయకులు దుర్గా, యాదగిరి , హమాలీ, మున్సిపల్, ఆశ , అంగన్వాడి, ఆటో, మధ్యాహ్న భోజన ఆయా, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



యుష్ శాఖలో వివిధ కేటగిరీల్లో నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా 358 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాం. వీటిలో డాక్టర్, సైకియాట్రిస్ట్, ఫిజియోథెరపిస్ట్, పంచకర్మ థెరపిస్ట్, యోగా ఇన్‌స్ట్రక్టర్, మల్టీపర్పస్ వర్కర్, స్వీపర్ వంటి పోస్టులు ఉన్నాయి. అలాగే 1 ఆయుర్వేద, 3 హోమియో కాలేజీల్లోని 140 టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులు కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తాం.

-ఏపీ మంత్రి సత్యకుమార్

ఆదాయపన్ను వసూళ్లు పెరగడమంటే మధ్యతరగతిని అణచివేయడం కాదు

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు పెరగడం అంటే మధ్యతరగతి ప్రజలను అణచివేయడం కాదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. రాజ్యసభలో 202627 కేంద్ర బడ్జెట్ పై జరిగిన చర్చలపై ఆమె ఈ మేర వ్యాఖ్యానించారు. పన్ను వసూళ్లు పెరుగుతున్నాయంటే దేశంలో మధ్యతరగతి వర్గం విస్తరిస్తుందనే అర్థం తప్ప, క్షీణించడం లేదని ఆమె వెల్లడించారు. పన్ను వసూళ్ల పెరుగుదలపై వస్తున్న ఆరోపణలను నిర్మలా తోసిపుచ్చారు. అది ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు నిదర్శనమని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలకు నిధులు తగ్గించినట్లు వస్తున్న విమర్శలను ఆమె ఖండించారు. ఏ రాష్ట్రానికి నిధులు నిలుపుదల చేయలేదని నిర్మలా స్పష్టం చేశారు. ఇప్పటివరకూ 48 లక్షల కోట్ల రూపాయలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరవేశామన్న కేంద్రమంత్రి, ఈ పద్ధతి ద్వారా అక్రమాలను అరికట్టి 4.31 లక్షల కోట్ల రూపాయలను ప్రభుత్వం ఆదా చేసిందని వివరించారు. మరోవైపు, 202627 సంవత్సారానికి గానూ రాజ్యసభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ గురించి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర నిధులు ఉచిత నగదు సమూహం కాదని, అది ప్రతీ భారతీ పౌరుడు కష్టపడి సంపాదించిన సొమ్మని నిర్మలా వ్యాఖ్యానించారు. వివిధ రాష్ట్రాలకు విడుదల చేసిన నిధుల గురించి విపక్షాలు అడిగిన ప్రశ్నలకు మంత్రి నిర్మలా ధీటుగా బదులిచ్చారు.



విశ్వ వీక్షణం



బంగ్లాదేశ్‌లో పార్లమెంట్ పోలింగ్

- బీఎన్‌పీ, జమాత్ మధ్య ప్రధాన పోటీ

ఢాకా: రాజకీయ అస్థిరతను ఎదుర్కొంటున్న బంగ్లాదేశ్‌లో గురువారం 13వ జాతీయ పార్లమెంట్ ఎన్నికల ఓటింగ జరిగింది. మాజీ ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం 2024 ఆగస్టులో విద్యార్థుల భారీ ఉద్యమంతో కూలిపోయిన తర్వాత ఏర్పడిన తాత్కాలిక పాలనకు ఈ ఎన్నికలు ముగింపు పలకనున్నాయి. ప్రస్తుతం మహమ్మద్ యూనస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న తాత్కాలిక ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తోంది. దేశవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉదయం 7.30 గంటలకు పోలింగ్ ప్రారంభమవ్వగా, సాయంత్రం 4.30 వరకు కొనసాగనుంది. తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున ఓటర్లు బారుల తీరారు. అయితే బ్యాలెట్ పత్రాలు, ఎన్నికల సామగ్రిని ముందుగానే భద్రతా బలగాల పర్యవేక్షణలో పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 12 సాయంత్రం ప్రారంభమై, ఫలితాలను ఫిబ్రవరి 13 ఉదయం అధికారికంగా ప్రకటించనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈసారి 299 పార్లమెంట్ స్థానాలకు 1,981 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో 249 మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. అవామీ లీగ్‌పై నిషేధం కొనసాగుతుండటంతో ఆ పార్టీ పోటీలో లేకపోవడం ఈ ఎన్నికల ప్రత్యేకత. బంగ్లాదేశ్ రాజకీయాల్లో ప్రభావం చూపిన ప్రధాన పార్టీ లేకుండా ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. ప్రస్తుతం షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ), షఫీకుర్ రెహమాన్ నేతృత్వంలోని జమాత్‌ఎఇస్లామీ కూటమి మధ్య నెలకొంది. విద్యార్థుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సీపీ) కూడా జమాత్ కూటమిలో భాగమైంది. అదనంగా జాతీయ పార్టీ, లెఫ్ట్ డెమోక్రాటిక్ అలయన్స్, అమర్ బంగ్లాదేశ్ పార్టీ తదితర రాజకీయ శక్తులు కూడా పోటీలో ఉన్నాయి. మొత్తం 59 పార్టీలలో 51 పార్టీలు ఎన్నికల్లో పాల్గొంటున్నాయి.


సింగిడి
హైదరాబాద్
శుక్రవారం
13.02.2026
9
ప్రతిపక్షం
Prathipaksham.in



అందాల బీచ్ చూద్దామా!!

మన దేశంలో చాలా బీచ్ లు ఉన్నాయి. అయితే.... అందులో కొన్ని స్పెషల్ బీచ్ లు ఉన్నాయి. మీరు కనుక ఆహ్లాదకరంగా గడపాలి... బీచ్ దగ్గర ఎంజాయ్ చేయాలి అనుకుంటే కచ్చితంగా ఈ బీచ్ లకు వెళ్లాల్సిందే. జీవితంలో ఒక్కసారైనా చూడాల్సిన బీచ్ లు ఏంటో ఓసారి చూద్దాం..







అగొండా బీచ్, గోవా

గోవా అంటేనే బీచ్. బంగారు రేణువులతో నిండిన ఇసుక, ప్రశాంతమైన అలల మధ్య రిలాక్స్ అవ్వాలంటే అగొండా బీచ్‌కి వెళ్ళండి. దక్షిణ గోవాలో ఉన్న ఈ బీచ్ పణజీ నుండి 15 నిమిషాల దూరంలో ఉంది.

రాధానగర్ బీచ్, హావ్‌లాక్ దీవి, అండమాన్

అండమాన్‌లోని రాధానగర్ బీచ్ స్వచ్ఛమైన నీరు, తెల్లని ఇసుకకు ప్రసిద్ధి. ప్రశాంత వాతావరణం, అందమైన ప్రకృతి ఇక్కడ ఉంది. రిలాక్స్ అవ్వాలనుకునేవారికి ఇది సరైన ప్రదేశం.

అంజునా బీచ్, గోవా

పార్టీ చేసుకోవాలంటే అంజునా బీచ్‌కి రండి. ఉత్తర గోవాలోని ఈ బీచ్‌లో కలర్ ఫుల్ పార్టీలు జరుగుతాయి. రాత్రంతా డాన్స్ చేయాలంటే అంజునా బీచ్ మరపురాని అనుభూతినిస్తుంది.

కోవలం బీచ్, కేరళ

దక్షిణ భారత స్వర్గం అని పిలువబడే కోవలం బీచ్ స్వచ్ఛమైన నీరు, మెత్తటి తెల్లని ఇసుక, కొబ్బరి చెట్లతో నిండి ఉంది. ఈ అందమైన బీచ్‌లో విశ్రాంతి తీసుకోవచ్చు. వాటర్ స్పోర్ట్స్‌లో కూడా పాల్గొనవచ్చు.

నీల్ దీవి, అండమాన్, నికోబార్

అండమాన్, నికోబార్‌లోని నీల్ దీవి విదేశీ పర్యాటకులకు ఇష్టమైన ప్రదేశం. పచ్చదనంతో నిండిన ఈ బీచ్ చాలా అందంగా ఉంటుంది. రోడ్లపై సైక్లింగ్ చేయవచ్చు. స్నార్కెలింగ్ కూడా చేయవచ్చు.

మహాబలిపురం బీచ్, చెన్నై

బంగాళాఖాతం ఒడ్డున ఉన్న మహాబలిపురం బీచ్ చారిత్రకంగా ముఖ్యమైనది. 7వ శతాబ్దపు ఆలయాలు ఇక్కడ ఉన్నాయి. ప్రాచీన వాస్తుశిల్పం, అందమైన తీరం మిమ్మల్ని ఆకర్షిస్తాయి.

మెరీనా బీచ్, చెన్నై

ప్రపంచంలోనే రెండవ అతి పొడవైన బీచ్ మెరీనా బీచ్. దక్షిణ భారత సౌందర్యాన్ని ఆస్వాదించడానికి ఇది సరైన ప్రదేశం. పొడవైన తీరం, చారిత్రక ప్రదేశాలు ఉన్నాయి.

కారైకాల్ బీచ్, పాండిచ్చేరి

పాండిచ్చేరిలోని కారైకాల్ బీచ్ అరసలార్ నది, బంగాళాఖాతం కలిసే చోట ఉంది. సూర్యోదయం, సూర్యాస్తమయం చూడటానికి బాగుంటుంది. ప్రశాంత వాతావరణం, అందమైన ప్రకృతి ఉన్న కారైకాల్ బీచ్ ప్రకృతి ప్రియులకు, ఛాయాచిత్రాలకు అనువైనది.

రుషికొండ బీచ్, విశాఖపట్నం

రుషికొండ బీచ్ బంగారు ఇసుక, స్వచ్ఛమైన నీటికి ప్రసిద్ధి. కుటుంబంతో వచ్చి ఆనందించడానికి అనువైనది. పిల్లలు, పెద్దలు కలిసి సమయం గడిపేందుకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంది.

అరామ్‌బోల్ బీచ్, గోవా

ఉత్తర గోవాలోని అరామ్‌బోల్ బీచ్ ప్రశాంత వాతావరణానికి ప్రసిద్ధి. నిశ్శబ్దం కోరుకునేవారికి ఇది మంచి ప్రదేశం. దగ్గర్లో ఉన్న మంచినీటి సరస్సు ఈ బీచ్ ప్రత్యేకత. దీనివల్ల అరామ్‌బోల్ బీచ్‌కి చాలా మంది వస్తుంటారు.



దేశ ప్రజల ఎదురు చూపుల ఫలితం ఈ ఎన్నికలు

- బీఎన్‌పీ చైర్మన్ రహమాన్

ఢాకా: బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ వేళ తదుపరి ప్రధాని అయ్యే అవకాశం ఉందని భావిస్తున్న బీఎన్‌పీ చైర్మన్, మాజీ ప్రధాని ఖలిదా జియా కుమారుడు తారిఖ్ రహమాన్ ఢాకాలో ఓటు వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కీలక కామెంట్స్ చేశారు. ఈ రోజు కోసం బంగ్లాదేశ్ ప్రజలు పదేళ్లుగా ఎదురుచూశారని అన్నారు. 'ఈ రోజు రాజ్యాంగబద్ధమైన నా ఓటు హక్కును వినియోగించుకున్నా. పదేళ్లకు పైగా బంగ్లాదేశ్ ప్రజలు ఈ రోజు కోసం ఎదురుచూశారు. గత రాత్రి కొన్ని ప్రాంతాల నుంచి కొన్ని అవాంఛనీయ ఘటనలు జరిగినట్లు నివేదికలు వచ్చాయి. అవి ఊహించనివి. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి చట్టాన్ని అమలు చేసే సంస్థలు కఠినంగా వ్యవహరిస్తాయని నమ్ముతున్నా. దేశవ్యాప్తంగా ప్రజలు బయటకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుంటే, ఎలాంటి కుట్రనైనా తిప్పికొట్టవచ్చు' అని రహమాన్ తెలిపారు. బీఎన్‌పీ అధికారంలోకి వస్తే మహిళా సాధికారతపై దృష్టి పెడతామని రహమాన్ స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ జనాభాలో సగం మంది మహిళలే ఉన్నారని, వారిని వెనక్కి వదిలేసి దేశం ముందుకు సాగలేదని అన్నారు. అందుకే తమ మేనిఫెస్టోలో మహిళా సాధికారిత ప్రధాన అంశామని పేర్కొన్నారు. తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగితే మొదటి రోజు నుంచి ఈ దిశగా పని చేయడం ప్రారంభిస్తామని రహమాన్ వివరించారు.



'వందే మాతరం' తప్పనిసరి.. మతస్వేచ్ఛపై దాడి


- జమియత్ ఉలామా-ఇ-హింద్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం వందేమాతరం పాడడాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై ప్రముఖ ముస్లిం సంస్థ జమియత్ ఉలామాఇహింద్ మండిపడింది. వందేమాతరం గేయంలోని ఆరు చరణాలను ముందుగా పాడాలని చెప్పడాన్ని కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ఏకపక్షమని అభివర్ణించింది. ఇది రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛపై దాడి అని జమియత్ అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదానీ ఎక్స్ వేదికగా ఆరోపించారు. ముస్లింలు ఎవరూ వందేమాతరం పాడకుండా నిరోధించరని, అయితే పాటలోని కొన్ని చరణాలు మాత్రం మాతృభూమిని దేవతగా చిత్రీకరించే నమ్మకాలపై ఆధారపడి ఉన్నాయని తెలిపారు. ఇది ఏకధర్మ మతాల ప్రాథమిక విశ్వాసానికి విరుద్ధంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది ఆర్టికల్ 25తో పాటు అనేక సుప్రీం కోర్టు తీర్పులను ఉల్లంఘించడమేనని చెప్పారు. కాగా, బంకించంద్ర ఛటోపాధ్యాయ రచించిన జాతీయ గేయం 'వందేమాతరం'లో మొత్తం ఆరు చరణాలను ఇకపై అధికారిక కార్యక్రమాల్లో పాడాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశించింది. జాతీయ గేయం వందేమాతరం, జాతీయ గీతం జనగణమన రెండింటినీ కలిపి పాడాల్సి వచ్చినప్పుడు మొదట వందేమాతరాన్నే ఆలపించాలని స్పష్టం చేసింది. జాతీయ గేయం పాడటానికి సంబంధించి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తొలిసారిగా కొన్ని నిబంధనలను రూపొందించి జనవరి 28న ఉత్తర్వులు జారీ చేసింది.



మనకు ఆదేశాలు ఇవ్వడానికి ఈ తెల్లోడు ఎవరు?

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: భారత్ అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా తప్పుబట్టారు. రష్యా నుంచి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా చమురు కొనుగోళ్లు చేస్తే భారత్‌పై అమెరికా 25 శాతం సుంకం విధిస్తామని చెప్పాడాన్ని విమర్శించారు. ఇది భారత సార్వభౌమత్వాన్ని అగౌరవపరచడమేనని అన్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం కూడా మౌనంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం లోక్‌సభలో మాట్లాడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ట్రంప్ ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. అందులో భారత్ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా రష్యా చమురు కొంటే 25 శాతం సుంకం విధిస్తామని అని ఉంది. అక్కడ కూర్చుని మనకు ఆదేశాలు ఇవ్వడానికి ఈ తెల్లోడు ఎవరు? దీని కోసమేనా దేశం స్వాతంత్ర్యం సాధించింది? మనకు కావాల్సిన దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తాం. ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది? ఆ తెల్లోడు ముందుక మనం ఎందుకు మనల్ని తగ్గించుకుంటున్నాం. మన ఆత్మగౌరవం ఏమైంది?' అంటూ ఒవైసీ ప్రశ్నల వర్షం కురిపించారు.







షూటింగ్‌లో భారత్‌కు స్వర్ణం

ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. గురువారం జరిగిన పురుషుల 50మీటర్ల రైఫిల్ 3 పొజిషన్‌లో యువ షూటర్ ఐశ్వర్య్ ప్రతాప్‌సింగ్ తోమర్ ప్రపంచ రికార్డుతో పసిడి పతకం కైవసం చేసుకున్నాడు. ఈ విభాగంలో భారత షూటర్లు క్లీన్‌స్వీప్ చేశారు. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన ఫైనల్లో ఐశ్వర్య్ ప్రతాప్ 362 వరల్డ్ రికార్డు స్కోరుతో అగ్ర స్థానంలో నిలువగా, నీరజ్ కుమార్(361.8), అఖిల్ షెరాన్(343.5) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. కేవలం 0.2 పాయింట్ తేడాతో ఐశ్వర్య్ పసిడి పతకాన్ని ఖాతాలో వేసుకున్నాడు. తన ఆఖరి షాట్‌లో 10.7 పాయింట్లు సాధించడంతో ప్రపంచ రికార్డు ఐశ్వర్య సొంతమైంది. మరోవైపు ఐశ్వరీ, నీరజ్, అఖిల్‌తో కూడిన భారత త్రయం 1769 పాయింట్లతో టీమ్ ఈవెంట్‌లోనూ స్వర్ణం సాధించింది.



నమీబియాపై భారత్ ఘన విజయం

టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ టీమ్‌ఇండియా వరుసగా రెండో మ్యాచ్‌లోనూ అదరగొట్టింది. తొలి మ్యాచ్‌లో బ్యాటర్లు కాస్త తడబడినా గురువారం నమీబియాతో ఢిల్లీ వేదికగా జరిగిన పోరులో మాత్రం మెరుపులు మెరిపించడంతో ప్రత్యర్థిని 93 పరుగుల భారీ తేడాతో ఓడించింది. మొదట బ్యాటింగ్‌కు వచ్చిన భారత్ 20 ఓవర్లకు 209/9 పరుగుల భారీ స్కోరు చేసింది. ఇషాన్ కిషన్ (24 బంతుల్లో 61, 6 ఫోర్లు, 5 సిక్సలు), హార్దిక్ పాండ్యా (26 బంతుల్లో 52, 4 ఫోర్లు, 4 సిక్సలు) అర్ధ శతకాలతో రాణించారు. ఛేదనలో నమీబియా 18.2 ఓవర్లకు 116కే ఆలౌట్ అయింది. స్టీన్ కాంప్ (29) టాప్ స్కోరర్. వరుణ్ చక్రవర్తి (3/7), అక్షర్ పటేల్ (2/20) స్పిన్ మాయకు తోడు బ్యాట్‌తో అదరగొట్టిన హార్దిక్.. బంతి (2/21)తోనూ రాణించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఆల్‌రౌండ్ షోతో రాణించిన హార్దిక్‌కే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. నమీబియా ఆహ్వానం మేరకు ముందు బ్యాటింగ్ చేసిన భారత్ రెండో ఓవర్లోనే తొలి వికెట్‌ను కోల్పోయింది. అభిషేక్ ఇంకా కోలుకోకపోవడంతో జట్టులోకి వచ్చిన సంజూ శాంసన్ (8 బంతుల్లో 22, 1 ఫోర్, 3 సిక్సలు) రెండో ఓవర్లో 6 ,6, 4తో ధాటిగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. కానీ మరో ఎండ్‌లో తిలక్ వర్మ (25) తో కలిసి ఇషాన్ బ్యాట్ ఝుళిపించాడు. స్మిత్ వేసిన ఆరో ఓవర్లో ఏకంగా 6, 6, 6, 6, 4తో 28 రన్స్ రాబట్టి 20 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. ఇషాన్ మెరుపులతో ఏడు ఓవర్లలోనే భారత స్కోరు 104/1తో పటిష్టమైన స్థితిలో నిలిచింది. అయితే 8వ ఓవర్లో ఎరాస్మస్.. ఇషాన్‌ను ఔట్ చేయడంతో స్కోరు వేగం నెమ్మదించింది. యూఎస్ఏతో మ్యాచ్‌లో రాణించిన కెప్టెన్ సూర్య (12).. బెర్నార్డ్ బౌలింగ్‌లో స్టంపౌట్ అవగా తర్వాతి ఓవర్లోనే ఎరాస్మస్, తిలక్‌నూ ఔట్ చేయడంతో 20 పరుగుల వ్యవధిలో మూడు కీలక వికెట్లు కోల్పోయింది. కానీ హార్దిక్, దూబె (23) ఐదో వికెట్‌కు 39 బంతుల్లోనే 81 రన్స్ జోడించి భారీ స్కోరుకు బాటలు వేశారు. ఆరంభం నుంచే వేగంగా ఆడిన ఈ ఇద్దరూ.. 15వ ఓవర్లో 24, 16వ ఓవర్లో 16 రన్స్ పిండుకున్నారు. ఎరాస్మస్ ఒకే ఓవర్లో హార్దిక్, దూబెతో పాటు అక్షర్‌నూ ఔట్ చేసి పరుగుల వేగానికి అడ్డుకట్ట వేశాడు. నిర్దేశిత 210 పరుగుల లక్ష్యఛేదనలో నమీబియా నిలకడ ప్రదర్శించలేకపోయింది. ఓపెనర్లు లారెన్ స్టీన్‌కాంప్(29), జాన్ ఫ్రైలింక్(22) ఒకింత మెరుగైన శుభారంభం అందించినా దాన్ని కొనసాగించడంలో విఫలమయ్యారు. ఈ ఇద్దరు టీమ్‌ఇండియా బౌలింగ్ దాడిని సమర్థంగా ఎదుర్కొంటూ బౌండరీలతో ఆకట్టుకున్నారు. ప్రమాదకరంగా మారుతున్న క్రమంలో ఫ్రైలింక్‌ను అర్ష్‌దీప్(1/36) ఔట్ చేయడం ద్వారా వికెట్ల ఖాతా తెరిచాడు. పవర్‌ప్లే ముగిసే సరికి నమీబియా వికెట్ నష్టానికి 57 పరుగులు చేసింది. కెప్టెన్ ఎరాస్మస్(18) వచ్చి రావడంతో దూకుడు ప్రదర్శించినా ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. హార్దిక్‌పాండ్యా(2/21), వరుణ్‌చక్రవర్తి(3/7), అక్షర్‌పటేల్(2/20) వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టి భారత భారీ విజయంలో కీలకమయ్యారు.



ఒమన్ పై శ్రీలంక భారీ విజయం

టీ20 వరల్డ్‌కప్‌లో శ్రీలంక వరుసగా రెండో విజయం నమోదు చేసింది. కొలంబో వేదికగా ఒమన్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో 105 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. లంక నిర్దేశించిన 226 పరుగుల ఛేదనలో ఒమన్ తేలిపోయింది. లంక బౌలర్లు విజృంభించడంతో 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 120 పరుగులే చేయగలిగింది. దుష్మంత చమీర, మహీష్ తీక్షణ చెరో 2, దునిత్ వెల్లలాగే, దాసున్ హేమంత, కామిందు మెండిస్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. భారీ లక్ష్య ఛేదనలో ఒమన్ పవర్ ప్లే లోనే ఒమన్ మూడు వికెట్లు కోల్పోయింది. ఆమిర్ ఖలీమ్ (6 పరుగులు), జితేందర్ సింగ్ (1 పరుగు), హమ్మద్ మీర్జా (9 పరుగులు) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. అప్పుడు క్రీజులోకి వచ్చిన మహ్మద్ నదీమ్, వాసిమ్‌తో కలిసి వికెట్ల పతనాన్ని కాసేపు అడ్డుకున్నాడు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 42 పరుగులు జోడించారు. అయితే 11.5 వద్ద వాసిమ్‌ను తీక్షణ ఔట్ చేశాడు. ఆ తర్వాతి ఓవర్లో తొలి బంతికే వినాయక్ శుక్లా (1 పరుగు) ఔట్ అయ్యాడు. ఇక ఒమన్‌లో నదీమ్ ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు. కానీ, నదీమ్ కావాల్సినంత వేగాంగా పరుగులు చేయలేదు. అతడు ఈ ఇన్నింగ్స్‌లో 56 బంతులు ఆడినప్పటికీ చేసింది 53 పరుగులే. ఇందులో మూడు ఫోర్లు, ఒక సిక్స్ ఉన్నాయి. వాసిమ్ అలీ (27 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. ఈ ఇద్దరు మినహా మిగిలిన బ్యాటర్లెవరూ రెండంకెల స్కోర్ చేయలేదు. చివర్లో వికెట్లు పడుతున్న నదీమ్ క్రీజులో నిలబడి తమ జట్టును ఆలౌట్ గండం నుంచి తప్పించాడు. కాగా, టీ20ల్లో పరుగులు పరంగా ఇది శ్రీలంకకు రెండో అతి పెద్ద విజయం. 2007 వరల్డ్‌కప్‌లో కెన్యాపై 172 పరుగుల భారీ తేడాతో లంక నెగ్గింది. పరుగుల పరంగా లంక జట్టుకు ఇదే భారీ విజయం. అటు ఒమన్‌కు ఇదే అతి ఘోర ఓటమి. పొట్టి ఫార్మాట్‌లో 100కు పైగా పరుగుల తేడాతో ఓడిపోవడం ఇదే తొలిసారి. గతంలో ఒమన్ 2025 ఆసియా కప్‌లో పాక్‌పై 93 రన్స్‌తో ఓడింది.

అన్ని వర్గాల ఆడియెన్స్ కోసం 'సీతా పయనం' తీశాను

- ఫ్యామిలీ అంతా కలిసి థియేటర్‌కు వచ్చి చూసేలా మా సినిమా ఉంటుంది
- దర్శక, నిర్మాత యాక్షన్ కింగ్ అర్జున్



యాక్షన్ కింగ్ అర్జున్ దర్శకత్వంలో నిరంజన్, ఐశ్వర్య అర్జున్ జంటగా తెరకెక్కించిన చిత్రం 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్ మీద అర్జున్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ మూవీతో ఐశ్వర్య అర్జున్ హీరోయిన్‌గా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాలో యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా స్పెషల్ పాత్ర లో కనిపించనున్నారు . ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 14న రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో చిత్ర నిర్మాత, దర్శకుడు అర్జున్ మీడియాతో ముచ్చటించారు. ఆయన చెప్పిన సంగతులేంటో ఓ సారి చూద్దాం.

'సీతా పయనం'ని నాలుగు భాషల్లో రిలీజ్ చేస్తుండటానికి గల కారణం ఏంటి?

నేను ఇంతకు ముందు ప్రతీ సినిమాని రెండు, మూడు భాషల్లోనే చేశాను. ఇది యూనివర్సల్ కాన్సెప్ట్. ఏ భాషలో చేసినా, తీసినా, చూసినా అందరికీ రిలేట్ అవుతుంది. ఇదొక ఫీల్ గుడ్ సబ్జెక్ట్. అన్ని భాషల్లో వర్కౌట్ అవుతుంది. అందుకే నాలుగు భాషల్లో సినిమాని రిలీజ్ చేస్తున్నాను.

మీ కూతురితోనే సినిమా తీయడం వల్ల బడ్జెట్ విషయంలో మార్పులు వచ్చాయా?

నా ఫ్యామిలీతోనే సినిమా తీయడంతో నాకు బడ్జెట్ మీద ఓ పట్టు ఉంటుంది. ఎక్కడ ఎంత ఖర్చు పెట్టాలి.. అనే విషయాన్ని నా చేతుల్లోనే పెట్టుకోగలను. నాకు ఆ కంఫర్ట్ లెవెల్ ఎక్కువగా ఉంటుంది.

తెలుగులోనే మీ అమ్మాయిని పరిచయం చేయాలని ఎందుకు అనిపించింది?

నాకు సినిమా పరిశ్రమ ఎంతో ఇచ్చింది. తెలుగు ప్రేక్షకులు నన్ను ఎంతగానో ప్రేమిస్తుంటారు. అందుకే ఐశ్వర్యని ఇక్కడి నుంచే లాంచ్ చేయాలని అనుకున్నాను.

ఈ కథకి ముందు వేరే హీరోని అనుకున్నారు?
ఆ తరువాత పరిణామాలు మారాయి. మరి కథ కూడా మార్చారా?

ముందు నేను కథను రెడీ చేసుకున్నాను. తరువాత విశ్వక్ సేన్ అనుకున్నాం. కొన్ని సందర్భాల్లో మనం అనుకున్నట్టుగా జరగవు. కథలో ఒక్క సీన్ కూడా మార్చలేదు. ఆ స్థానంలోకి నిరంజన్ వచ్చాడు. విశ్వక్ సేన్‌తో సమస్యలేమీ లేవు. అన్నీ పరిష్కరించుకున్నాం. జీవితం ఒక సర్కిల్ లాంటిది. ఇక్కడ కక్ష్య సాధింపులు ఏమీ ఉండవు. మళ్లీ సెట్ అయితే కలిసి సినిమా చేస్తాం.

ఇండస్ట్రీలో వారసులుగా కొడుకులనే లాంచ్ చేస్తుంటారు. మీరు మాత్రం కూతురిని లాంచ్ చేస్తున్నారు?

కొడుకులే కాదు, కూతుర్లు కూడా వారసులే. అసలు అలా బేధం చూపకూడదు. వాళ్ల వాళ్ల అభిరుచులకు తగ్గట్టు మనం సపోర్ట్ చేయాలి. మా అమ్మాయికి నటన పట్ల ఆసక్తి ఉంది. అందుకే సినిమాల్లోకి తీసుకు వచ్చాను.

'సీతా పయనం'లో ఎలాంటి అంశాలుంటాయి?

ఇదొక మెచ్యూర్డ్ స్టోరీ. ఇందులో కేవలం ప్రేమ కాదు. ఇందులో ఎన్నో రకాల ఎమోషన్స్, అంశాలున్నాయి. ఈ సినిమాని చూస్తే అవేంటో ప్రేక్షకులకు అర్థమవుతుంది. ఫ్యామిలీ, దేశాన్ని ప్రేమించడం కూడా ఓ దేశ భక్తి అవుతుంది.

నటుడిగా ఇంకా ఎలాంటి పాత్రల్ని పోషించాలని అనుకుంటున్నారు?

నటుడిగా నేను అన్ని రకాల పాత్రల్ని పోషించాలని అనుకున్నాను. విశాల్ 'అభిమన్యుడు' చిత్రానికి నాకు మంచి పేరు వచ్చింది. విలన్‌గా, కమెడియన్‌గా నటించడం చాలా గ్రేట్ . అందుకే నటుడిగా నేను అన్ని రకాల యాంగిల్స్‌లో నిరూపించుకోవాలని అనుకున్నాను. నెక్ట్స్ నా నుంచి ఒక యాక్షన్ మూవీ రాబోతోంది.

సినిమా చూశాక సెన్సార్ మెంబర్లు ఇచ్చిన కాంప్లిమెంట్స్ ఏంటి?

సెన్సార్ బోర్డ్ మా సినిమాను చూసి చాలా ఎమోషనల్ అయ్యారు. బయటకు వచ్చాక ఎంత మంచి సినిమా తీశారు అని నన్ను మెచ్చుకున్నారు. ఒక్క కట్ లేకుండా యు సర్టిఫికెట్ ఇచ్చారు.

'సీతా పయనం'కి సంబంధించిన ఐడియా ఎప్పుడు? ఎలా వచ్చింది?

13 ఏళ్ల క్రితం ఈ సబ్జెక్టకి సంబందించిన ఐడియా వచ్చింది. అప్పటి నుంచి అలా నా మెదడులో మెదులుతూనే ఉంది. నా కూతురికి అప్పుడే ఈ పాయింట్‌ను చెప్పాను. అలా కథ మొత్తాన్ని ఫినిష్ చేశాను. ఇలాంటి ఓ మంచి కథతోనే నా కూతురిని ఇంట్రడ్యూస్ చేయాలని అనుకున్నాను.

హీరో, హీరోయిన్ పాత్రల గురించి చెప్పండి?

కేవలం డ్యాన్స్ కోసం, గ్లామర్ కోసం రాసుకున్న పాత్ర కాదు. ఇందులోని ఏ పాత్ర కూడా అలా వచ్చి ఇలా వెళ్లదు. ఇందులో నటనకు ఎంతో స్కోప్ ఉంటుంది. ఐశ్వర్య, నిరంజన్ పాత్రల గురించి సినిమాను చూసి ఆడియెన్స్ చెబుతారు. ఇందులోని ఫాదర్ అండ్ డాటర్ రిలేషన్‌ను అద్భుతంగా చూపించాం. ఇంత వరకు చూడనటువంటి ఎమోషన్‌ను చూపించబోతోన్నాను.

నటన, దర్శకత్వం.. రెండింటిలో ఏది కంఫర్ట్‌గా ఉంది?

నా వద్ద ఆరేడు స్క్రిప్టులు రెడీగా ఉన్నాయి. నటన కంటే దర్శకత్వం చేయాలనే ఉంది. నెక్ట్స్ నా నుంచి ఓ మాస్ యాక్షన్ మూవీ రాబోతోంది. అందులో ప్రేమ కథ, పాటలు వంటివి ఉండవు. పూర్తిగా యాక్షన్ ఓరియెంటెడ్‌గా నా ఏజ్‌కు తగ్గ పాత్రలోనే కనిపిస్తాను.

'హనుమాన్ జంక్షన్ 2' వచ్చే అవకాశం ఉందా?

'హనుమాన్ జంక్షన్ 2' చేయాలని నాక్కూడా ఉంది. నిన్ననే జగపతి బాబుతో మాట్లాడాను. అతను కూడా అదే అన్నాడు. కానీ మంచి కథ సెట్ అవ్వాలి. ఎవరైనా మంచి కథతో వస్తే నేనే నిర్మిస్తాను, దర్శకత్వం వహిస్తాను.

ఈ మూవీ ప్రారంభోత్సవానికి పవన్ కళ్యాణ్ వచ్చారు? ఆయనతో అనుభవం గురించి చెప్పండి?

పవన్ కళ్యాణ్ ని ఒక ఐదారు సార్లు మాత్రమే కలిశాను. కానీ ఈ సినిమా పూజా కార్యక్రమాలకు రావాలని అడిగినప్పుడు వెంటనే ఒప్పుకున్నారు. ఐదు నిమిషాలు అని వెళ్తే మూడు గంటలు ఆయనతో మాట్లాడాను. ఆయన ఎంతో నిజాయితీ గల వ్యక్తి. ఇలాంటి రాజకీయ నాయకుడు ఉండటం గొప్ప విషయం. 'ఖుషి' నుంచి నా ఇంట్లో అందరికీ ఆయనంటే ఇష్టం. 'మీ కోసం మేం ఉన్నాం' అని చెప్పేందుకు వచ్చాను అని పూజా కార్యక్రమాల్లో ఆయన అన్నారు.

మీరు రాజకీయాల్లోకి వస్తారా?

నాకు రాజకీయాలపై అంతగా అవగాహన లేదు. నాకు రాజకీయాలు పడవు. నేను ఇప్పుడు నటిస్తూ, దర్శకత్వం చేస్తూ బాగానే ఉన్నాను కదా (నవ్వుతూ). మంచి చేయాలనే ఉద్దేశం అయితే నాకు ఉంది. కానీ రాజకీయాలు అనేది సపరేట్ దారి.

'హే భగవాన్' ప్రేక్షకులకు నవ్వులు పంచుతుంది

- మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్




ఇటీవల లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి, ఈషా వంటి బ్లాక్‌బస్టర్స్ చిత్రాలను అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం తాజాగా నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై 'హే భగవాన్' అనే ఫుల్‌లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు. ఈ చిత్రంలో సుహాస్, శివానీ నగరం, సీనియర్ నటుడు నరేష్, యాంకర్ స్రవంతి ప్రముఖ పాత్రల్ని పోషించారు. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీని ఫిబ్రవరి 20న రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం హైదరాబాద్‌లో నాట్ ఏ ట్రైలర్ పేరుతో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయి దుర్గ తేజ్ మాట్లాడుతూ..''ఈ మూవీ ట్రైలర్ చాలా బాగుంది. ప్రేక్షకులకు నవ్వులు పంచేలా ఈ సినిమా ఉంటుంది. సుహాస్ చాలా హార్డ్ వర్క్ చేస్తాడు. తెలుగు సినిమాలతోపాటు తమిళ మూవీస్‌లోనూ సత్తా చాటుతున్నాడు. 'హే భగవాన్' చిత్రం అందర్నీ ఎంటర్‌టైన్ చేస్తుంది. ఈ సినిమా టీమ్ అందరికీ పెద్ద విజయం తెచ్చిపెట్టాలని కోరుకుంటున్నా''అని చెప్పారు.



శివరాత్రికి 'నాగబంధం' టీజర్

రిలీజ్ చేయనున్న సూపర్ స్టార్ మహేష్ బాబు

విరాట్ కర్ణ హీగా అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'నాగబంధం' ఈ వేసవిలో విడుదలకు సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 15న మహా శివరాత్రి శుభ సందర్భంగా ఉదయం 11:11 గంటలకు టీజర్ విడుదల కానుండగా, మేకర్స్ ఇప్పుడు ఎక్సయిటింగ్ అప్‌డేట్ ఇచ్చారు. సూపర్ స్టార్ మహేష్ బాబు టీజర్‌ను లాంచ్ చేస్తారని టీం అనౌన్స్ చేసింది. సూపర్ స్టార్ అసోసియేషన్ ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న బజ్‌ను మరింత పెంచుతుంది. ప్రధాన తారాగణం పోస్టర్‌లను రిలీజ్ చేసిన టీం, ఇటీవల రిషబ్ సాహ్నీని ఆఫ్ఘన్ పాలకుడు అబ్దాలి పాత్రలో పరిచయం చేసింది. 1750లో సెట్ చేయబడిన ఈ చిత్రం నాగబంధం సంప్రదాయంతో ముడిపడి ఉన్న పురాతన రహస్యాలను అద్భుతంగా చూపించబోతుంది.నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటిస్తుండగా, జగపతి బాబు, జయప్రకాష్, మురళి శర్మ, బి.ఎస్. అవినాష్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సౌందర్ రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీ, ఆర్‌సి ప్రణవ్ ఎడిటింగ్, అశోక్ కుమార్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్న ఈ విజువల్ వండర్ ప్రేక్షకులను మెస్మరైజ్ చేయడానికి సిద్ధంగా ఉంది.



'ది ప్యారడైజ్' ఆగస్టు 21న రిలీజ్

నేచురల్ స్టార్ నాని మ్యాసీవ్ పీరియడ్ యాక్షన్ డ్రామా ది ప్యారడైజ్. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం హాటెస్ట్ పాన్‌ఇండియన్ రిలీజెస్ లో ఒకటిగా శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. హైదరాబాద్‌లో చిత్రీకరణ జోరుగా సాగుతుండగా, నిర్మాతలు ఇప్పుడు రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. 'ది ప్యారడైజ్' చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ రిలీజ్ డేట్ సినిమాకు వరుసగా మూడు వారాల పండుగలు కలిసిరానున్నాయి. మొదటి వారంలో ఓనం, మిలాద్‌ఉన్‌నబీ పండుగలు మధ్యలో రావడం, రెండో వీకెండ్‌లో రాఖీ బంధన్, మూడో వారంలో జన్మాష్టమి ఉండటం వల్ల భారీ బడ్జెట్ స్పెక్టకిల్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు బాక్సాఫీస్ వద్ద బిగ్ అడ్వాంటేజ్ ఉండబోతుంది. ప్లానింగ్‌లో ప్రత్యేక గుర్తింపు ఉన్న నాని, ఈ నిర్ణయంతో మరోసారి తన మార్కెట్ సెన్స్‌ని చూపించారు. ప్రస్తుతం టీమ్ చిత్రంలోని హైలైట్ లలో ఒకటైన నాని ఇంట్రడక్షన్ సాంగ్ చిత్రీకరణలో బిజీగా ఉంది. వందలాది డ్యాన్సర్లతో భారీ సెట్లో తెరకెక్కుతున్న ఈ పాటకు రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ హై వోల్టేజ్ మాస్ ట్యూన్ అందించగా, నాని రా ఎనర్జీకి సరిపోయేలా రూపొందిస్తున్నారు. కోరియోగ్రాఫర్ సుధన్ మాస్టర్ భారీ విజువల్స్‌తో ఈ సాంగ్‌ని పూర్తి స్థాయి క్రౌడ్ ప్లీజర్‌గా తీర్చిదిద్దుతున్నారు. ది ప్యారడైజ్‌లో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేష్ బాబు వంటి స్టార్ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ చివరి దశకు చేరుకుంటుండగా, నాని ఫియర్స్ 'జడల్' లుక్‌తో విడుదలైన రిలీజ్ డేట్ పోస్టర్ సినిమాపై ఉన్న ఎక్సైట్మెంట్ ను మరింత పెంచింది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200